ప్రజాశక్తి

మంగళవారం 9 మే 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

మిర్చి రైతు కుదేలు

- అకాల వర్షాలతో మరింత తగ్గిన ధరలు
- నెల రోజుల్లో క్వింటాలుకు రూ.4వేలు పతనం



ఇటీవల వానలకు పెదకూరపాడులో తడిసిన మిర్చి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు మిర్చి యార్డులో ధరల తగ్గుదల కొనసాగుతోంది. విదేశీ ఆర్డర్లు లేవు.. వర్షాలతో నాణ్యత తగ్గుతుందని వ్యాపారులు అంటున్నారు. నెల రోజులుగా ధరల పెరుగుదల లేదు. సాధారణ రకాలు కనిష్ట ధర క్వింటాళ్ రూ.9 వేలు, గరిష్ట ధర రూ.23 వేలు ఉన్నట్టు అధికారులు తెలిపారు. మేలురకాలైన తేజ, బాడిగ, దేవనారు డీలక్స్ రకాలు ధరలు కూడా గతనెల కంటే బాగా తగ్గాయి. ఈ రకాల ధరలు కనిష్ఠంగా రూ.9 వేలు, గరిష్ఠంగా రూ.23 వేల వరకు ఉన్నాయి. గత నెలలో సాధారణ రకాల కనిష్ఠంగా రూ.12 వేలు, గరిష్ఠంగా రూ.27 వేల వరకు పలికాయి. మేలురకాలు కనిష్ఠంగా రూ.13 వేలు, గరిష్ఠంగా రూ.30 వేల వరకు పలికాయి. ఎక్కువ సరుకు కనిష్ఠ ధరలకే కొనుగోలు చేస్తున్నారు. నాణ్యత లేదనే కారణంతో ధరలు తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

సోమవారం యార్డుకు 1,00,102 టిక్కీలు రాగా పాత నిల్వలతో కలిపి 96,526 టిక్కీల విక్రయాలు జరిగాయి. ఇంకా 64,054 టిక్కీలు యార్డులో నిల్వ ఉన్నాయి. 334 రకం కనిష్ఠ ధర రూ.10వేలు కాగా గరిష్ట ధర రూ.22 వేలు, నంబరు-5 రకం రూ.13-16 వేలు, 273 రకం రూ.12-19 వేలు, 341 రకం రూ.10-23 వేలు, సూపర్-10 రకం రూ.18,500 ధరలు పలికాయి. తేజ కనిష్ఠ ధర రూ.9 వేలు, గరిష్ట ధర రూ.23,500, బాడిగ కనిష్ఠ ధర రూ.9300, గరిష్ట ధర రూ.23,500, దేవనూరు డీలక్స్ రూ.10 వేలు కనిష్ఠ ధర కాగా గరిష్ఠ ధర రూ.20 వేలు పలికింది.

ఈ ఏడాది యార్డులో సీజన్ మొదలైన తరువాత గత మూణ్ణెల్లలో రైతులు అకాల వర్షాలు పలుమార్లు వెంటాడాయి. వీటి వల్ల మిర్చి నాణ్యత తక్కువగా ఉందన్న సాకుతో ధరలు తగ్గించారు. నాణ్యత తక్కువగా ఉండటం వల్ల వ్యాపారులు కూడా కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. అంతేగాక విదేశీ ఆర్డర్లు కూడా లేవంటున్నారు. అకాల వర్షాలతో కొంత ఇబ్బంది ఏర్పడగా ధరలు తగ్గుదల వల్ల రైతులు లబోదిబోమంటున్నారు. పెట్టుబడి ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టినట్టు రైతులు తెలిపారు. కనీసం 15 క్వింటాళ్ల దిగుబడి రావాలని, ధర క్వింటాళ్ రూ.20 వేలకు తగ్గకుండా ఉంటేనే కొంత వరకు నష్టాల నుంచి బయటపడతామని రైతులు చెబుతున్నారు. పంట కోత ప్రారంభం నుంచి గత మూణ్ణెల్లుగా అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. పంట తడవకుండా కాపాడుకునేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. ఇటీవల వర్షాలకు కోతలకు సిద్ధంగా ఉన్న మిర్చి, కోసి కళ్లాల్లో ఆరబోసిన మిర్చి కూడా తడిసి రైతులు గుండెలు బాదుకుంటున్నారు.



ప్రాతూరు రైతు భరోసా కేంద్రంలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పసుపు పంటను ప్రభుత్వమే కొనాలి

రైతు భరోసా కేంద్రాల్లో పసుపు రైతుల సంఘం వినతులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

పసుపు పంటను మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఎంటిఎంసి పరిధిలోని ప్రాతూరు, చిర్రావూరు, కుంచనపల్లి, వడ్డేశ్వరం గ్రామాల్లో సోమవారం వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ గతేడాది డిసెంబర్‌లో అకాల వర్షాల వల్ల పంట దిగుబడి తగ్గిందని, ఈ ఏడాది మార్చి, మే నెలల్లో అకాల వర్షాలకు పంట కళ్లాల్లోనే తడిసిందని చెప్పారు. దీంతో పంట పూర్తిగా రంగు మారి ఎర్రబారడం వల్ల వ్యాపారులు క్వింటాళ్‌కు రూ.3200 - 4000కు మించి కొనడం లేదని, నాణ్యమైన పంటకు మరో రూ.వెయ్యికి మించి ధర ఇవ్వడం లేదని తెలిపారు. ఒకవైపున కౌలు, పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగి ఎకరా సాగుకు రూ.1.70 లక్షలు ఖర్చవుతుంటే దిగుబడి 20-25 క్వింటాళ్లకు మించడం లేదని, ఎకరాకు రూ.75 వేల చొప్పున రైతులు నష్టపోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి క్వింటాళ్ రూ.6850 మద్దతు ధరకు కొనాలని, మద్దతు ధరను రూ.10 వేలకు పెంచాలని కోరారు. వినతిపత్రాలు ఇచ్చిన వారిలో డి.వెంకటరెడ్డి, బి.సంసోను, డి.రాజేంద్రబాబు, డి.సురేష్, ఎస్.వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, ఎ.రంగారావు, కె.పాలు, బి.సుదర్శనరావు, కె.ఆనందరావు, బి.గోపాలరావు, ని,సుబ్బారావు, పి.శివనాగేశ్వరరావు, బి.మోహనరావు, జి.వెంకటేశ్వరరావు, ఎం.శ్రీనివాసరెడ్డి, కె.ఈశ్వర్‌రెడ్డి, ప్రసాద్, వి.పున్నయ్య ఉన్నారు.

వైసిపి కార్పొరేటర్ల అలక

- స్టాండింగ్ కమిటీ భేటీపై ప్రతిష్టంభన
- పార్టీ అగ్రనేతలకు శిరోభారంగా మేయర్, ఎమ్మెల్యేల వివాదం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు కార్పొరేషన్‌లో వైసిపి కార్పొరేటర్లు అలకబూనారు. దీంతో నగరంలో అభివృద్ధి పనుల ఆమోదంపై ప్రతిష్ఠంభన ఏర్పడింది. రూ.20 లక్షలు దాటి జరిగే పనులకు కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలపాల్సి ఉంది. ఈ సమావేశం మూడు సార్లుగా వాయిదా పడుతోంది. వైసిపికి చెందిన ముగ్గురు కార్పొరేటర్లు ఈ సమావేశానికి రావడం లేదు. గతనెల రోజులుగా ఈ తంతు జరుగుతోంది.

అభివృద్ధి పనుల్లో మేయర్, ఎమ్మెల్యేలే కీలక భూమిక పోషిస్తున్నారని కార్పొరేటర్లు అసంతృప్తిగా ఉన్నారు. కార్పొరేటర్లు కూడా పనుల్లో తమకు 5 శాతం ఇవ్వాలని కాంట్రాక్టర్లను వత్తిడి చేస్తున్నారని తనదృష్టికి వచ్చినట్టు ఒక ప్రజా ప్రతినిధి చెప్పారు. మేయర్, ఎమ్మెల్యేలకు కూడా పర్సంటేజిలు ఉన్నాయని ఆరోపణలు విన్పిస్తున్నాయి. అభివృద్ధి పనుల్లో కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధుల వాటాలపై నగరంలో ఇప్పటికే పెద్ద ఎత్తున దుమారం చెలరేగింది. గాంధీ పార్కు ఆధునీకీకరణకు రూ.5 కోట్లు వెచ్చించడంపైనా ఆరోపణలు వస్తున్నాయి. వైసిపి నేతల అవినీతిపై టిడిపి నాయకులు నశీర్ అహ్మద్, కోవెలమూడి రవీంద్ర, టిడిపి కార్పొరేటరు ▶ 2లో

10వ తేదీ నుండి డీఎస్సీ 1998 అభ్యర్థుల రిలే దీక్షలు



మాట్లాడుతున్న కృష్ణకాంత్ తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

డీఎస్సీ-1998 అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ 10, 11, 12 తేదీల్లో విజయవాడలో జరిగే రిలే దీక్షలను విజయవంతం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కృష్ణకాంత్ పిలుపునిచ్చారు. ఈ మేరకు అభ్యర్థులతో కలిసి బ్రాడీపేటలోని సంఘ కార్యాలయంలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. 1998 డీఎస్సీ అర్హత సాధించిన అభ్యర్థులు పోస్టింగ్ కోసం అప్పటి నుండి ఆందోళన చేస్తున్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా అధికారంలోకి వచ్చిన వెంటనే మీ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. 5887 మందిని తీసుకుంటామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించినా ▶ 2లో

ఉత్తమ ప్రదర్శనగా అతీతం

- ద్వితీయ ప్రదర్శనగా నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత
- యండమూరి వీరేంద్రనాథ్‌కు గోపరాజు శివరామశర్మ జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం
- ముగిసిన కొలంకపురి నాటక పరిషత్ నాటిక పోటీలు



వీరేంద్రనాథ్‌కు సత్కారం

ప్రజాశక్తి-తెనాలి

నాటక కళామతల్లికి వినూత్న హారం కొలంకపురి నాటక కళాపరిషత్ జీవిత సాఫల్య పురస్కారమని ప్రముఖ సినీ, నాటక, నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్ అన్నారు. మండలంలోని కొలకలూరులో ఈనెల 5న ప్రారంభమైన కొలంకపురి నాటక కళాపరిషత్ ఇరు తెలుగు రాష్ట్రాల ▶ 2లో

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ విఆర్ఒ

పొలాన్ని ఆన్‌లైన్ చేయడానికి రూ.20 వేలు డిమాండ్

ప్రజాశక్తి అచ్చంపేట



పట్టుబడిన విఆర్ఒ నాగేశ్వరరావు

పొలాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయడానకి రూ.15 వేలు లంచం తీసుకుంటూ సోమవారం ఏసీబీకి అచ్చంపేట మండలం వేల్పూరు ఇన్‌ఛార్జి విఆర్ఒ కె.నాగేశ్వరావు పట్టుబడ్డారు. ఏసీబీ డిఎస్‌పి కె.ప్రతాప్‌కుమార్ వివరాల ప్రకారం.. గ్రంథసిరికి చెందిన కిలారి చెంచయ్యకు సర్వే నెంబర్ 140, 146 సర్వే నెంబర్లలో 6.20 ఎకరాల పొలం ఉంది. సర్వే నెంబర్లు సరిగా లేకపోవడంతో 2022లో చెంచయ్య కుమారుడు మురళి సర్వే ▶ 2లో

నేడు బండారు ముత్యాలు వర్ధంతి

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు పట్టణంలోని మేకా అమరారెడ్డి భవన్‌లో సిపిఎం నాయకులు బండారు ముత్యాలు వర్ధంతి నిర్వహిస్తున్నట్లు పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. ప్యారీ కంపెనీ గేటు వద్ద గల బండారు ముత్యాలు స్థూపం వద్ద జెండా ఆవిష్కరణ ఉంటుందని చెప్పారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి లో సోమవారం తల్లుల దినోత్సవ సందర్భంగా అన్న సంతర్పణ సేవా సమితి ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి మాత మూర్తులకు పండ్లు, దుస్తులు పంపిణి చేశారు.ఈ కార్యక్రమం లో సేవా సమితి ఫౌండర్ చైర్మన్ త్రిపుర మల్లు వాణి నిర్మల, గ్రంధి ధనలక్ష్మి, రాధారాని, జయంతి పాల్గొన్నారు.

పులుల రాకపై వదంతులను నమ్మొద్దు



పల్నాడు జిల్లా అటవీశాఖాధికారి రామచంద్రరావు

ప్రజాశక్తి - నరసరావుపేట: జనావాసాల్లోకి పులులు వచ్చినట్లు సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మొద్దని పల్నాడు జిల్లా అటవీశాఖాధికారి రామచంద్రరావు తెలిపారు. అటవీ ప్రాంత సమీపంలోని గ్రామాల్లోకి పులులు వచ్చినట్లు ఆధారాలేమీ లభించలేదని అన్నారు. ఈ మేరకు సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గడిచిన 24 గంటల్లో బొల్లాపల్లి మండలంలో ఇద్దరు మహిళలపై చిరుత పులి దాడి చేసినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో అసత్యమని, దీన్ని ప్రచారంలో పెట్టినవారిపై బండ్లమూడి పోలీస్‌స్టేషన్లో కేసులు నమోదు చేశామన్నారు. ఆ వీడియో 5 నెలల క్రితం ఉత్తరాఖండ్‌లో జరిగిన ఘటనకు సంబంధించినదని చెప్పారు. ప్రజలు ఆందోళన చెందొద్దని, తాము తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. అటవీ ప్రాంతాల్లో 36 సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని, వాటిని నిత్యం పరిశీలిస్తున్నామని, పులుల సంచారం ఆధారాలు లభించలేదని చెప్పారు. రెండుమూడ్రోజుల్లో మరో 50 సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

లంచం తీసుకుంటూ పట్టబడ్డ విఆర్‌ఒ

(మొదటి పేజీ తరువాయి)

చేయించారు. సర్వే చేసిన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగారు. కొండూరుకు చెందిన విఆర్‌ఒ నాగేశ్వరావును వేల్పూర్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. పొలాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలంటే రూ.50 వేలు డిమాండ్ చేశారు. చివరికి రూ.20 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దరఖాస్తు చేసిన 5వ తేదీన రూ.5 వేలు ఇచ్చిన బాధితుడు అనంతరం ఏసీబీని ఆశ్రయించారు. దీంతో బాధిత రైతు మురళికి సోమవారం నగదును ఇచ్చిన ఏసీబీ అధికారులు కార్యాలయం పక్కనే మాటు వేశారు. అదే నగదును విఆర్‌ఒ తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుణ్ణి అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఏసీబీ సిఐలు నాగరాజు, రవిబాబు, సురేష్, ఎస్ఐ మూర్తి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రెవెన్యూ కార్యాలయంలోని విఆర్‌ఒ సిబ్బంది సైతం లంచాలు అడుగుతున్నారని, డిజిటల్ అసిస్టెంట్లు కూడా విఆర్వోలకు తెలియకుండా దరఖాస్తులు తీసుకోవద్దంటూ హెచ్చరిస్తున్నారని తమకు దృష్టికి వచ్చినట్లు డీఎస్పీ తెలిపారు.

10వ తేదీ నుండి డీఎస్సీ 1998 అభ్యర్థుల రిలే దీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

4072 మందినే తీసుకున్నారని చెప్పారు. నియామక ప్రక్రియలో రోస్టర్ విధానం పాటించని కారణంగా ఓసీ అభ్యర్థులకు మాత్రమే పోస్టింగులు వచ్చాయని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళలు, వికలాంగుల అభ్యర్థులు నష్టపోయారని తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ అయిన 559 మందికి పోస్టింగ్ ఇవ్వాల్సి ఉందన్నారు. తక్షణమే వారందరికీ పోస్టింగ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అభ్యర్థులు వి.మేరీ సుహాసిని, సారిక, భారతి పాల్గొన్నారు.

విజ్ఞానంతోనే అసమానతలు దూరం

వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ లక్ష్మణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సమాజంలో చదువు ద్వారా ఆర్థిక అసమానతల చిమ్మ చీకట్లు తొలగి సమానత్వంతో ఆవిర్భవిస్తుందని ఎమ్మెల్సీ కేయస్ లక్ష్మణరావు అన్నారు.అరండల్‌పేటలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో చైర్మన్ బత్తుల దేవానంద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, జిల్లా చైర్మన్ బత్తుల దేవానంద్ తదితరులతో కలిసి ఎమ్మెల్సీ కేయస్ లక్ష్మణరావు ప్రారంభించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ, చైతన్యవంతమైన సమాజానికి విజ్ఞానమే కొలబద్ధమని పేర్కొన్నారు. చిన్నారులు ప్రస్తుత వేసవిలో శెలవులను వృధాగా గడపకుండా ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షులు మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని అన్నారు.ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ జ్ఞానాన్ని సముపార్జించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు డైరక్టరు బందా బరవీంద్రనాథ్, కార్పొరేటర్లు ఈచంపాటి ఆచారి, శ్రీవల్లి, బూసి రాజలత,అంబేద్కర్, బోడపాటి ఉషా, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రదర్శనగా 'అతీతం'



ప్రేమతో నాన్న నాటికలో సన్నివేశం

(మొదటి పేజీ తరువాయి)

స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు సోమవారం రాత్రితో ముగిశాయి. ముగింపు సందర్భంగా గోపరాజు వెంకట శివరామశర్మ జీవిత సాఫల్య పురస్కారంతో యండమూరిని సత్కరించారు. ప్రముఖ నాటక రచయిత పిన్నమనేని మృత్యుంజయరావు అధ్యక్షతన జరిగిన పురస్కార సభలో యండమూరి మాట్లాడుతూ 75 ఏళ్ల తన రచనా ప్రస్థానంలో 20వ ఏట నుంచే సత్కారాలు, సన్మానాలు ప్రారంభమయ్యాయన్నారు. రఘుపతి రాఘవ రాజారామ్ నాటకంతో ప్రొఫెషనల్‌గా గుర్తింపు పొందానన్నారు. మనుషులొస్తున్నారు జాగ్రత్త, రుద్రవీణ నాటకాల రచనలు మరింత గుర్తింపుకు దోహదం చేశాయని చెప్పారు. కొలంకపురి నాటక కళాపరిషత్ లాంటివి ఉన్నతం కాలం రంగస్థలానికి మనుగడకు కొదవలేదన్నారు. తన రచనలో శైలి, శిల్పం, పాత్రధారణ, నాచురలిజమ్, అప్‌సెట్ థియేటర్ వంటి అన్నింటికీ ఆద్యులైన గురువులు దేచిరాజు హనుమంతరావుకు ఈ పురస్కారాన్ని అంకితం చేస్తున్నట్లు చెప్పారు.

దర్శక దార్శనికుల గౌరవ సత్కారం

నాటిక పోటీల చివరి రోజున ప్రముఖ రంగస్థల సీనియర్ కళాకారులు, రచయితలు, దర్శకులకు దర్శక, దార్శనిక పురస్కారాలతో కళాపరిషత్ సత్కరించింది. సత్కారాలు పొందిన వారిలో కెఎస్‌టి సాయి, జిఎస్‌ఆర్‌కె శాస్త్రి, డిఎస్సార్ మూర్తి, ఎస్‌కె మిశ్రో, ఎంసి దాస్, బిఎం రెడ్డి, మల్లాల శివన్నారాయణ ఉన్నారు.

చివరి ప్రదర్శనగా ప్రేమతో నాన్న..

నాటిక పోటీల్లో చివరి ప్రదర్శనగా శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరి వారి 'ప్రేమతో నాన్న' నాటికను ప్రదర్శించారు. భర్త పెట్టే హింస భరించలేక భార్య పడే వేదన, తల్లికి చెప్పుకుంటే పరువుకోసం సర్దుకుపోవాలని చెప్పటం, అప్పటికీ భరించలేని కుమార్తె బాధను గ్రహించిన తండ్రి ఆమెకు అండగా నిలుస్తాడు. కాపురానికి వెళ్లలేనని, భర్త పెట్టే బాధలు భరించలేనని కుమార్తె ప్రాధేయపడటం గమనించి, తనవద్దే పెట్టుకుని, తన కాపురం తనే సరిదిద్దుకోవాలని, భర్త పెట్టే హింసను తిప్పికొట్టాలని హితబోధ చేస్తాడు. అదే అజమాయిషీ చెలాయిస్తూ పుట్టింట్లో ఉన్న భార్య వద్దకు వచ్చిన భర్తకు గుణపాఠం ఇతివృత్తంగా నాటిక సాగింది. నాటికకు దర్శకత్వం గోపరాజు విజయ్ వహించారు. ప్రత్యక్షంగా నాటికను తిలకించిన యడమూరి నుంచి బంగారు పతకాన్ని అందుకున్నారు.

నాటిక పోటీల విజేతల వివరాలు

నాలుగు రోజులపాటు నిర్వహించిన నాటిక పోటీల విజేతల వివరాలను గోపరాజు విజయ్ వెల్లడించారు. ఉత్తమ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి 'అతీతం', ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా విశాఖపట్టణం తెలుగు కళాసమితి వారి ప్రదర్శన 'నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత', ఉత్తమ తృతీయ ప్రదర్శనగా ఏలూరుకు చెందిన హేలాపురి కల్చరల్ అసోసియేషన్ వారి 'మనసున మనసై' నాటికలు ఎంపికయ్యాయి. ఉత్తమ నటుడుగా నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటికలో కుమార్ పాత్రధారి ప్రసాద్, ఉత్తమ నటిగా దారుణం నాటికలో సుమలత, ఉత్తమ దర్శకులుగా అతీతం నాటిక దర్శకులు ఎస్.రవీంద్రరెడ్డి, ఉత్తమ రచయితగా దారుణం నాటిక రచయిత పరమాత్ముని శివరాం దక్కించుకున్నారు. విజేతలకు నగదు పారితోషకాలు, షీల్డులు బహూకరించారు. కార్యక్రమంలో గోపరాజు వెంకటరమణ, షేక్ జానిబాషా, సుద్దపల్లి మురళీధర్, భర్తిపూడి సుబ్బారావు, కళాకారులు పాల్గొన్నారు.

వైసిపి కార్పొరేటర్ల అలక

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు.

మేయర్ ఆదేశాలంటూ టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారు. ఇటీవల బస్టాండ్‌లో జరుగుతున్న నిర్మాణాలకు నోటీసులు ఇవ్వగా వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరుపై కోర్టును ఆశ్రయించారు. కోర్టు కమిషనర్‌కు నోటీసులు ఇచ్చింది. దీంతో ఆగ్రహించిన కమిషనర్... టౌన్ ప్లానింగ్ ఇన్‌స్పెక్టర్ రసూల్‌ను సస్పెండ్ చేశారు. నగరంలో జరుగుతున్న నిర్మాణాల్లో నిబంధనలు ఉల్లఘిస్తే నోటీసులిచ్చి జరిమానాల ద్వారా కార్పొరేషన్‌కు ఆదాయం కల్పించాల్సిన అధికారులు కార్పొరేటర్ల ద్వారా సంబంధిత యజమానులను బెదిరింప చేసి పెద్ద ఎత్తున సొమ్ములు దండుకుంటున్నారు. తిలా పాపం తలా పిడికెడు చందంగా అధికారులు కొంత మంది కార్పొరేటర్లు పంచుకుంటున్నారని ఆరోపణలు విన్పిస్తున్నాయి. నగరంలో ప్రజా ప్రతినిధులుకొంత మంది బినామీ పేర్లతో పనులు దక్కించుకుంటున్నారని తమకు ఏమీ ఉండటం లేదని పలువురు కార్పొరేటర్లు వాపోతున్నారు.

మొత్తం మీద కార్పొరేషన్‌లో అవినీతి అక్రమాలు సిఎం కార్యాలయానికి ఎప్పటికప్పుడు ఫిర్యాదులు వెళుతున్నాయి. అధిష్టానం ఆదేశాలతో పార్టీ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని ఎంపి ఆళ్ల అయోధ్య రామిరెడ్డి ఇటీవల మేయర్, ఎమ్మెల్యే ముస్తాఫాకు గట్టిగానే క్లాసు తీసుకున్నారు. అభివృద్ధి పనుల్లో తమకు ప్రాధాన్యం లేదని అలిగిన కార్పొరేటర్లు మేయర్, ప్రజా ప్రతినిధులపై గుర్రుగా ఉన్నారు. అయితే గుంటూరు నగరంలో జరుగుతున్న వ్యవహారాలపై వైసిపి కార్యకర్తలే మంగళవారం నుంచి ప్రారంభం కానున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ఫిర్యాదులు చేసేందుకు సిద్ధం అవుతున్నారని తెలిసింది.

వికలాంగులకు మోటారు సైకిళ్లు అందజేత

ప్రజాశక్తి - తాడికొండ :వికలాంగులకు మూడు చక్రాల మోటారు సైకిళ్లను గుంటూరు జిల్లా చైర్పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా, తాడికొండ నియోజకవర్గం సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్‌లు సోమవారం వైసిపి తాడికొండ నియోజకవర్గ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి కులం,మతం, పార్టీలు చూడకుండగా సంక్షేమ ఫలాలు పేదవాడి చెంతకే చేరుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు



గురుకుల విద్యా సంస్థల సెక్రెటరీకి కెఎస్ అభినందన

ప్రజాశక్తి-గుంటూరు:ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో గురుకుల పాఠశాలలు అత్యుత్తమ ప్రతిభ చూపినందుకుగాను ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యా సంస్థల సొసైటీ సెక్రెటరీ ఆర్.నరసింహారావును పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అభినందించారు. ఈ మేరకు సోమవారం స్థానిక కొరిటపాడులోని సంస్థ కార్యాలయంలో నరసింహారావును కలిసి సన్మానించారు. పదో తరగతి ఫలితాల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు మేనేజ్‌మెంట్ల ఆధ్వర్యంలోని పాఠశాలలతో పోల్చితే ఎపి గురుకులాలు 95.25 శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. ఈ నేథ్యంలో నరసింహారావుకు కెఎస్ లక్ష్మణరావుతోపాటు, టీచర్స్ అసోసియేషన్ నాయకులు ఇ.మధుసూదన్, డాక్టర్ పి.వి.మల్లేశ్వర్ శుభాకాంక్షలు తెలిపారు.



తరగతి గదిలో బోధిస్తున్న అశ్విన్ మణిదీప్

రెండో రోజు ఐఏఎస్ శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక బ్రాడీపేట యుటిఎఫ్ సమావేశ మందిరంలో కెవిఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ (సన్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐఎఎస్ ఫౌండేషన్ క్లాసులు రెండో రోజు కొనసాగాయి. అభ్యర్థులకు యుపిఎస్‌సి పరీక్షల్లో ర్యాంకు సాధించి, శిక్షణ పూర్తి చేసుకున్న ఐఆర్‌ఎస్ అధికారి అశ్విన్ మణిదీప్ శిక్షణా తరగతులు బోధించారు. సివిల్స్ పరీక్షకు సిద్ధం కావాల్సిన పద్ధతులు, ప్రస్తుత సమకాలీన అంశాలను గురించి వివరించారు. ఈ శిక్షణ మే 16వ తేదీ వరకూ ఉంటుందని సన్ నిర్వాహకులు కె.సాయికుమార్ తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్.బాలు, ఎం.అజయ్, పీరుసాహెబ్ పాల్గొన్నారు.



ప్రతిభ చాటిన విద్యార్థులతో కలశాల డైరెక్టర్‌లు

డిగ్రీ మొదటి సెమ్ ఫలితాల్లో వాగ్దేవి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నరసరావుపేట

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ శనివారం విడుదల చేసిన డిగ్రీ బీఎస్సీ, బి.కాం (కంప్యూటర్స్) మొదటి సెమిస్టర్ ఫలితాల్లో తమ కాలేజీ విద్యార్థులు అన్ని విభాగాల్లో మంచి ఫలితాలు సాధించి పట్టణంలో ప్రథమ స్థానంలో నిలిచారని వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాద్, సెక్రటరీ - కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు తెలిపారు.ఎంఎస్‌సిస్ విభాగంలో షేక్ హామీద 700/656 మార్కులు సాధించగా పి.ప్రవల్లిక 643, జె.జయ దీపిక 633 మార్కులు సాధించారని తెలిపారు. ఎంపిసిఎస్ విభాగంలో వై.శ్రావణి 643, సిహెచ్ బాలవైష్ణవి 640, కె.శ్యామలరాణి 639 మార్కులు సాధించారని చెప్పారు. బికాంలో జి.నాగ మల్లిక 650/583, వి.అనిత 565, ఎ.రాజేశ్వరి 557 మార్కులు సాధించారని వివరించారు. ఈ మేరకు కాలేజీలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వీరిని అభినందించారు. రాయల శ్రీనివాసరావు మాట్లాడుతూ మేథమెటిక్స్, ఫిజిక్స్‌లో, స్టాటిస్టిక్స్‌లో 100/100 మార్కులతో ప్రతిభ చూపారన్నారు. మొదటి సెమిస్టర్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు 90 శాతం ఉత్తీర్ణత సాధించారని అన్నారు. విద్యార్థులను కాలేజీ డైరెక్టర్లు కె.రామకోటేశ్వరరావు, ఒ.నాగేశ్వరరావు, ఎం.కోటేశ్వరరావు, ఎస్.సురేష్‌బాబు, పి.కృష్ణారావు, ఐ.కృష్ణకిషోర్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ప్రజాశక్తి
క్రైమ్ కార్నర్ 3
మంగళవారం 9 మే 2023

పని చేస్తుండగా దూసుకొచ్చిన ప్రమాదం

- లారీ ఢీకొని పారిశుధ్య కార్మికుడు మృతి
- పరిహారం కోసం సిఐటియు ఆందోళన
- లారీ యజమాని రూ.2 లక్షలు, ప్రభుత్వ సాయం ఇచ్చేందుకు అంగీకారం

ప్రజాశక్తి దాచేపల్లి

విధి నిర్వహణలో ఉన్న పారిశుధ్య కార్మికుణ్ణి లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన దాచేపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. దాచేపల్లిలోని ఎస్సీ కాలనీకి చెందిన కొట్ర మరియబాబు (36) దాచేపల్లిలో 12 ఏళ్లుగా పారిశుధ్య కార్మికునిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 9 గంటలకు దాచేపల్లి లోని కారంపూడి రోడ్డు వద్ద వ్యర్థాలను ట్రాక్టర్‌లో వేస్తున్నారు. అదే సమయంలో గుంటూరుకు చెందిన లారీ హైదరాబాద్ నుండి గుంటూరు వైపు నుండి వస్తూ ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ట్రాక్టర్‌ను నడుపుతున్న మరియబాబు తీవ్రంగా గాయపడగా పక్కనే ఉన్న మరో కార్మికుడు పెదకోటయ్య చెయ్యి విరిగింది. వెంటనే వీరిని స్థానిక ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మరియబాబు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పెద్దకోటయ్య చేతికి కట్టు కట్టి మెరుగైన చికిత్స కోసం పిడుగురాళ్లలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సిఐటియు నాయకులు ఆస్పత్రి వద్దకు చేరుకుని మృతుని కుటుంబం నుండి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం న్యాయం కోసం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. మృతుని కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఐదు సెంట్ల స్థలాన్ని ఇవ్వాలని, పిల్లల చదువు బాధ్యతలను ప్రభుత్వమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారుల నుండి స్పందన లేకపోవడంతో రహదారి వైపు వెళ్లి రాస్తారోకో చేపట్టారు. వారితో మాట్లాడిన పోలీసులు చివరికి ఆందోళన చేస్తున్న వారిని బలవంతంగా స్టేషన్ వద్దకు తీసుకెళ్లారు. అప్పటికే లారీ ఓనర్, ప్రజా ప్రతినిధులు అక్కడ ఉండి మృతుని కుటుంబానికి లారీ ఓనర్ ద్వారా రూ.50 వేలు ఇప్పిచాలని చూశారు. దీన్ని తిరస్కరించిన కుటుంబీకులు, నాయకులు మరోసారి రస్తారోకోకు దిగారు. అరగంట తర్వాత సిఐ బిలాలుద్దీన్ చర్చలకు పిలిపించి లారీ ఓనర్ ద్వారా రూ.2 లక్షలు ఇప్పిస్తామని చెప్పడంతో ఆందోళన ముగిసింది. దీంతోపాటు ప్రభుత్వం నుండి రావాల్సిన సాయాన్నీ అందిస్తామని మున్సిపల్ చైర్మన్ కొప్పుల సాంబయ్య హామీనిచ్చారు. రూ.5 లక్షల బీమాను అందిస్తామని, మృతుని కుటుంబంలో ఒకరికి మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగం ఇస్తామని, జగనన్న కాలనీలో ఇల్లు కేటాయిస్తామని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేసిఉంటే కార్మికుల కుటుంబాలు ఇంత అభద్రతలో ఉండేవి కాదని, ఇప్పటికైనా స్పందించాలని కోరారు. మృతుని కుటుంబానికి సరైన పరిహారంతోపాటు ఆ కుటుంబానికి జీవన భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్ యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ సిలార్ మసూద్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి.శీను, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు, కార్మికులు పాల్గొన్నారు.


మృతదేహాన్ని ఆటోలో రహదారిపై ఉంచి ఆందోళన చేస్తున్న కార్మికులు, నాయకులు


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు.... వెనక ముసుగుల్లో నిందితులు

గంజాయి విక్రయించే ముఠా అరెస్టు

ప్రజాశక్తి-తాడేపల్లి

గంజాయికి బానిస అవ్వడమే కాకుండా గంజాయి అమ్ముతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తాడేపల్లి సిఐ శేషగిరిరావు, ఎస్ఐ డి.రమేష్ సోమవారం వెల్లడించారు. విజయవాడ సత్యనారాయణపురానికి చెందిన కాకర్లపూడి అశోక్, తాడిగడపకు చెందిన దుర్గాప్రవీణ్, తాడేపల్లి ఇప్పటం గ్రామానికి చెందిన ఇండ్ల దుర్గాసాయితేజ, గాజుల వెంకటేశ్వరరావు, మంగళగిరి మండలం నవులూరుకు చెందిన కొల్లి సాయితేజ ముఠాగా ఏర్పడి గంజాయి అమ్ముతున్నారు. కాకర్లపూడి అశోక్ ప్రధాన సూత్రధారి కాగా గంజాయిని విశాఖపట్నం, పాడేరు ప్రాంతాల్లో నుండి తెచ్చి అమ్ముతున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండడానికి చిన్నచిన్న ప్యాకెట్ల రూపంలో యువకులకు అమ్ముతున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఇప్పటం శివారులో అరెస్టు చేసి వారి వద్ద నుండి కిలోన్నర గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ ఐదుగుర్ని కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ పోలీసులు తెలిపారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 100,102
మిర్చి ఎగుమతి	: 96,526
మిర్చి నిల్వ	: 64,054

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10,000 - 22,500
నెం.5	13,000 - 16,000
273	12,000 - 19,000
341	10,000 - 23,000
4884	10,500 - 19,500
సూపర్ 10	18,500 - 18,500
నాన్ ఏసి	
తేజ	9,000 - 12,300
బడిగి	9,300 - 23,500
దేవనూరు డీలక్స్	10,000 - 20,000
తాలుకాయలు	5,000 - 13,000

డీజిల్ చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



ఆగి ఉన్న లారీలో నుండి డీజిల్‌ను చోరీ చేసిన కేసులో ఇద్దర్ని అరెస్టు చేయగా మరొక బాలుణ్ణి అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వివరాలను ఎస్ఐ రవీంద్ర సోమవారం వెల్లడించారు. మండలంలోని తుమ్మలపాలేనికి చెందిన దేశబోయిన బాజీ తన సొంత లారీని నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో తన లారీని గతనెల 30వ తేదీన జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డులో నిలిపి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు చూసేసరికి అందులోని 30 లీటర్ల డీజిల్ మొత్తం చోరీకి గురైనట్లు గమనించాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు కలిసి కారులో వచ్చి చోరీకి పాల్పడినట్లు నిర్ధారించుకున్నారు. నిందితులు వి.పుల్లలచెరువు మండలం గంగవరానికి చెందిన లెక్కల పూర్ణ, బొల్లాపల్లి మండలం సీతారామపురం తండాకు చెందిన మూడవతు హనుమా నాయక్, మరో బాలుడుగా గుర్తించారు. ఇద్దరి అరెస్టు చేయగా బాలుణ్ణి అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి చోరీకి ఉపయోగించిన వాహనంతోపాటు ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



వ్యసనాలకు బానిసైన యువకుడు తన తండ్రిని డబ్బుల కోసం ఇబ్బంది పెట్టి.. తండ్రి ఆస్పత్రికి వెళ్లివచ్చేలోపే ఆత్మహత్య చేసుకున్నాడు. నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులో సోమవారం వెలుగు చూసిన ఘటనపై ఎస్ఐ రవీంద్ర వివరాల ప్రకారం.. ప్రత్తిపాడుకు చెందిన ఎస్‌కె మహబూబ్ సుభానికి కుమార్తెతోపాటు బాజీ (19) అనే కుమారుడున్నాడు. బాజీ చెడు వ్యసనాలకు అలవాటు పడి డబ్బు కోసం ఇంట్లో గొడవ చేస్తుంటాడు. డబ్బులు ఇవ్వకుంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నమూ డబ్బుకోసం తండ్రితో గొడవ పెట్టుకున్నాడు. స్నేహితులు సర్దిచెప్పి తీసుకెళ్లగా రాత్రి మళ్లీ గొడవకు దిగాడు. దీంతో తండ్రికి గుండె దడ రావడంతో కుమార్తెను తీసుకుని రాత్ర 10.30 గంటలకు స్థానిక ప్రభుత్వాస్పత్రికి వెళ్లారు. అరగంట తర్వాత వారు ఇంటికొచ్చే సరికి ఇంట్లోని ఫ్యాన్‌కు బాజీ ఉరేసుకుని ఉన్నాడు. వెంటనే చుట్టుపక్కల వారి సాయంతో కిందికి దించి దగ్గర్లోని ఆర్ఎంపి వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిజిహెచ్‌కు తరలించారు.

ఖాతాదార్లకు తెలియకుండానే నగదు డ్రా!

ప్రజాశక్తి - రెంటచింతల

దంపతులకు తెలియకుండానే వారి ఖాతాల్లో నుండి నగదును దుండగులు డ్రా చేశారు. దీనిపై గురజాల సిఐ దార్ల జయకుమార్‌కు బాధితులు సోమవారం ఫిర్యాదు చేశారు. వివరాల ప్రకారం.. ఆంజనేయ స్వామి మాన్యంలో నివారం ఉండే దొండేటి వెంకటేశ్వర్‌రెడ్డి పొలాల్లో బోర్లు వేయిస్తుంటారు. ఈయనతోపాటు ఈయన భార్య విజయలక్ష్మికి మండల కేంద్రమైన రెంటచింతలలోని యూనియన్ బ్యాంకులో ఖాతాలున్నాయి. ఈ క్రమంలో గత మార్చి 7వ తేదీ నుండి ఆరు రోజులపాటు రోజుకు రూ.10 వేల చెప్పున నగదు వెంకటేశ్వర్‌రెడ్డి ఖాతా నుండి ఆయనకు తెలియకుండా దుండగులు డ్రా చేశారు. విజయలక్ష్మి ఖాతా నుండి ఫిబ్రవరి 13న 8 వేలు డ్రా చేశారు. ఇదేమీ తెలియని వెంకటేశ్వరెడ్డి ఈనెల 5వ తేదీన బ్యాంకుకు వెళ్లి డబ్బులు డ్రా చేయడానికి ప్రయత్నించగా అందులో ఏమీ లేనట్లు తెలిసింది. మేనేజర్‌ను సంప్రదించగా దంపతుల ఇద్దరి ఖాతాల్లో రూ.68 వేలు మాయమైనట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు చేసుకో వడంపై ఖాతాదార్లు ఆందోళనకు గురవుతున్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

కలెక్టర్ స్పందనకు 178 ఫిర్యాదులు

ప్రజాశక్తి-నరసరావుపేట

జిల్లా ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి ఒక్క జిల్లా అధికారి నిబంధనల ప్రకారం మానవత్వంతో పని చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డాక్టర్.బి.ఆర్. అంబేద్కర్ స్పందన హాల్‌లో సోమ వారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(స్పందన) కార్యక్రమం జరిగింది. జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, పులిచింతల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డాక్టర్. కె.ఎల్.రావు సాగర్‌లు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అంతకు ముందు జిల్లా అధికారులతో కలిసి పరిపాలన అంశాలపై జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతులను సమర్పించి జిల్లా అధికారులను వేడుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 178 మంది ప్రజలు తమ ఫిర్యాదులు పరిష్కరించాలని విన్నవించారు. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, పల్నాడు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్. కంజుల మోహన్ రెడ్డి, కమిటి సభ్యులు వ్యవస్థాపకులు హెన్రీ దునంట్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.పల్నాడు జిల్లా కలెక్టరేట్ లో జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన పథకం (మెప్మా), వై.ఎస్.ఆర్ క్రాంతి పథం శాఖల ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలు సేంద్రీయ ఎరువులతో పండించిన పంటలు ప్రదర్శన అమ్మకాల నిర్వహణ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న మహిళలు

ఇంతవరకూ వేతనాలు ఇవ్వలేదు

కరోనా సమయంలో కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ప్రాణాలకు తెగించి లింగంగుంట్ల కోవిడ్ హాస్పిటల్ లో 6 నెలల పాటు శానిటేషన్ పనులు చేసిన తమకు ఇంతవరకు వేతనాలు ఇవ్వలేదని, తక్షణమే ఇవ్వాలని రావిపాడు,ఉప్పలపాడు, లింగంగుంట్ల కు చెందిన మహిళలు కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులు నెలకు రూ.15 వేల చొప్పున చెల్లిస్తామని చెప్పారని, విధులలో రెగ్యులర్ చేస్తామని చెప్పి చేయకపోగా, పని చేసిన 6 నెలలకు వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. దీనిపై జిల్లా రెవిన్యూ అధికారి వినాయకం స్పందిస్తూ సంబంధిత ఏజెన్సీ కి సాంకేతిక లోపాల కారణంగా ప్రభుత్వం నుండి నగదు చెల్లింపులో జాప్యం నెలకొందని, సంబంధిత అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. మహిళలకు మద్దతు తెలిపిన ఎం.ఐ.ఎం జిల్లా ప్రెసిడెంట్ కరిముల్లాహ్, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ లు మాట్లాడుతూ మహిళలకు న్యాయం చేయకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు.

'జగనన్నకు చెబుదాం'కు 82 ఫిర్యాదులు

ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు పరిష్కరించాలని వచ్చిన అర్జీదారుల నుండి పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవి శంకర్‌రెడ్డి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల నుండి కుటుంబ,ఆర్థిక,ఆస్తి తగాదాలు మొదలగు సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు అందాయన్నారు. ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. స్పందన కార్య క్రమానికి వచ్చిన ప్రజలకు వారి ఫిర్యా దులను రాస పెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహకారాలు అందించారు. డీఎస్పీ లు రవిచంద్ర, విజయభాస్కరరావు, పల్లపు రాజు, ఆదినారాయణ, సీఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు. ఒక మహిళ వద్ద చీటీపాట కట్టానని, గడువు ముగియడంతో నగదు చెల్లిం చాలని అడిగితే తనను బెదిరిస్తున్నారని, తనకు డబ్బులు ఇప్పించి న్యాయం చేయా లని నరసరావుపేట నుండి ఒక మహిళ ఎస్పీ వద్ద తన గోడు వెళ్లబోసుకున్నారు. మరణించిన తన అల్లుడి స్వార్జితంలోని ఆస్తిలో వాటా ఇవ్వాలని, అల్లుడి అన్న తన ను, కూతురిని మానసికంగా హింసిస్తూ, పరుష పదజాలంతో మాట్లాడు తున్నారని, తమ అంతం చూస్తామని బెది రిస్తున్నారని తమకు రక్షణ కల్పించాలని రొంపిచర్ల నుండి ఒక పెద్ద మనిషి తన సమస్యను ఎస్పికి విన్నవించుకున్నారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు



గత ఏడాది తన భర్త హనుమంత నాయక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టి మృతి చెందాడని, ఆ తర్వాత నుంచి తన అత్తమామల అండతో తన భర్త సోదరులు రామావతు గోపినాయక్, శ్రీను నాయక్‌లు తనను లైంగికంగా ఇబ్బంది పెడుతున్నారని గుత్తికొండకు చెందిన రేఖాభాయ్ ఫిర్యాదు చేశారు. అత్త మామలు, గోపినాయక్, శ్రీను నాయక్‌లు చెప్పినట్లుగా తాను వింటేనే తన భర్తకు రావాల్సిన ప్రమాద బీమా నగదు, ఆస్తి, నగదు, బంగారు ఆభరణాలు ఇస్తామని, పుట్టింటికి వెళితే కనుక ఆస్తిలో చిల్లిగవ్వ కూడా ఇవ్వమని, తమ ఇష్టానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే ఇద్దరి పిల్లలతో సహా చంపేస్తామని బెదిరిం పులకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. తనకు న్యాయం చేయాలని తన సోదరుడు సహాయంతో ఎస్పీని కలిసి విజ్ఞప్తి చేశారు.

కబ్జా చేసింది కాక బెదిరింపులు



కొన్నేళ్ళ క్రితం ప్రభుత్వం తనకు మంజూరు చేసిన 5 సెం ట్ల స్థలాన్ని తమ కుమా రుడు యంద్రపల్లి కృష్ణప్రసాద్ సమీప బంధువులు పిల్లి విక్టోరియా, జెర్రిపోతు వెంకటరమణ, యంద్రపల్లి నటరాజ్ కబ్జా చేశారని అచ్చంపేట మండలం కోనూరు గ్రామానికి చెందిన యంద్రపల్లి చిన్న మైసియ్య ఫిర్యాదు చేశారు. అనారోగ్యంతో ఉన్న తనను కుమార్తె గెరా శివకుమారి చేరదీసిందని, స్థలం గురించి మాట్లాడిన ఆమెను అంగన్వాడీ టీచర్ ఉద్యోగం నుంచి తీసి వేస్తామని, చంపేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, తమకు రక్షణ కల్పించాలని కోరారు.

యాచకసొమ్మును లాగేసుకున్నారు



పుట్టుకతోనే అంగ వైకల్యం ఉన్న తనను, తన ముగ్గురు అన్నలు, అక్క పట్టించుకోకపోవడంతో యాచకవృత్తిని ఎంచుకొని జీవనం సాగిస్తున్నానని, ఇలా సంపాదించిన డబ్బును, ప్రభుత్వం తనకు ఇచ్చే పింఛన్ సొమ్మును అక్క దాసరి వెంకాయమ్మ, ఆమె భర్త శేషయ్యలు విడతల వారిగా బలవంతంగా లాక్కెళ్లారని గురజాల మండలం తేలుకుట్ల గ్రామానికి చెందిన వికలాంగుడు దేవరశెట్టి గురవయ్య ఫిర్యాదు చేశారు. వారికి అడ్డువచ్చిన తల్లి మరియమ్మను , తనను కొట్టారని, ఆ డబ్బులు తిరిగి అడిగితే చంపేస్తామని బెదిరిస్తున్న వారి నుండి తమకు రక్షణ కల్పించాలని వేడుకున్నారు.

ఆస్తి కోసం మరదలు వేధింపులు



తన తల్లి ఆస్తిని తన తమ్ముడి భార్య లింగాల శారమ్మ కాజేయాలని చూస్తోందని, ఇదేమని ప్రశ్నిస్తే బావ అని చూడకుండా ఆమె కుటుంబ సభ్యులతో దాడి చేయించిందని పిడుగురాళ్ల మండలం జానపాడుకు చెందిన లింగాల పిచ్చయ్య ఎస్పీకి ఫిర్యాదు చేశారు. రెండేళ్ల క్రితం తన తమ్ముడు అనారోగ్యంతో మృతి చెందాడని, తల్లి బాగోగులు తాను చూస్తున్నట్లు తెలిపారు. తల్లికి పుట్టింటి ద్వారా వచ్చిన 2.5 సెంట్ల స్థలాన్ని తన పేరిట రిజిస్టర్ చేసిందని, అందులో వాటా ఇవ్వాలని తన మరదలు తనపై, తల్లిపై వేధింపు లకు పాల్పడుతోందని న్యాయం చేయాలని కోరారు.

వేలంలో పాడుకున్న ఆస్తిని అప్పజెప్పట్లేదు



అచ్చంపేటకు చెందిన ఇసుక టిప్పర్ యజమాని గుండా వెంకయ్య ఇంటిని 2018 లో సత్తెనపల్లి కోర్టు వేలంపాటలో వేసిందని, ఆ ఇంటిని రూ.10 లక్షలకు తాను దక్కించుకుని నాలుగేళ్లు అయినప్పటికీ తమకు అప్ప జెప్పలేదని తాడేపల్లికి చెందిన విన్నకోట మదన్ మోహన్‌రావు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పలు మార్లు కోర్టును ఆశ్రయించగా ఈ ఏడాది కొంతమంది పోలీసుల సమక్షంలో ఆ ఇంటిని తమకు అప్పజెప్పారని, వారం రోజులు ఆ ఇంట్లో నివసించిన అనంతరం అనారోగ్యం బారినపడ్డ తాను తాడేపల్లి వెళ్లానని, వెంకయ్య కుటుంబసభ్యులు ఆ ఇంటిని ఆక్రమించారని , ఆ ఇంటి వైపు వస్తే చంపేస్తామని, తనను బలవంతం చేసినట్లు కేసు పెడ తానని వెంకయ్య భార్య లక్ష్మి తనను బెదిరిస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొ న్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి

అన్నావదినల మోసంపై తమ్ముడు ఫిర్యాదు

గుంటూరులో నివాసం ఉంటూ ఆడిట్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం చేసుకుంటున్న తన అన్న పురంశెట్టి పెద్ద నాగేశ్వరరావు కుటుంబ అవసరాలకు తన వద్ద రెండు విడతలుగా రూ.8.17 లక్షలు తీసుకున్నాడని, తిరిగి ఇవ్వమంటే ఇచ్చేది లేదంటున్నారని దాచేపల్లి మండలం పెదగార్లపాడుకు చెందిన పురంశెట్టి నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై దాచేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోలేదని, తనపై తన అన్న ఫిర్యాదు చేయడంతో తనను పలు మార్లు స్టేషన్ చుట్టూ తిప్పారని చెప్పారు. బ్యాంక్ ద్వారా లావాదేవీలు జరిగాయని, తీసుకున్న డబ్బులు ఇవ్వకపోగా అడిగితే చంపేస్తామని తన అన్నావదినలు బెదిరిస్తున్నారని, పొలం సాగు చేసి సంపాదించానని, న్యాయం చేయాలని కోరారు.

ఇల్లు ఖాళీ చేయట్లేదు.. అద్దె ఇవ్వట్లేదు

చిలకలూరిపేట సాంబశివనగరంలోని తమ ఇంటిని నాలుగేళ్ల క్రితం బోడావుల అరవింద అనే మహిళ అద్దెకు తీసుకుందని, 10 నెలలుగా అద్దె ఇవ్వడం లేదని చిలకలూరిపేట పండరీపురానికి చెందిన దాసం ఉషారాణి ఫిర్యాదు చేశారు. అద్దె చెల్లించి ఇల్లు ఖాళీ చేయమని కోరగా 'అద్దె ఇవ్వను.. ఇల్లు ఖాళీ చేయను..ఏమి చేస్తారో చేసుకోండి' అంటూ బెదిరింపులకు పాల్పడు తోందని ఆరోపించారు. తమ నివాసంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగు తున్నాయని సమీపంలో నివసించే వారు చెబుతున్నారని పేర్కొన్నారు. అద్దె డబ్బులు ఇప్పించాలని, ఇల్లు ఖాళీ చేయించాలని ఎస్పీని వేడుకున్నారు.

దాడి చేసిన హోమ్‌గార్డుపై చర్యలు తీసుకోండి

విచక్షణ రహితంగా తనను కొట్టిన సత్తెనపల్లి పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న హోమ్‌గార్డువలేటి మోహన్‌రావుపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి మైనర్ బాలిక ఫిర్యాదు చేసింది. తన కుక్కపిల్లతో కలిసి నడుచుకుంటూ వెళుతుండగా తప్పించుకున్న అది, అదేసమయంలో అటువైపు వస్తున్న మోహన్‌రావు ద్విచక్ర వాహనానికి అడ్డుతగిలి ఆపై వెళ్లిపోయిందని, కోపంతో హోమ్‌గార్డు తనపై దాడి చేశాడని, ఆ మార్గంలో వెళ్లే పెద్దలు వారించడంతో వదిలి పెట్టాడని పేర్కొంది. దీనిపై సత్తెనపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలి తం లేదని, ఆ హోమ్‌గార్డుపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది.

పోక్సో కోర్టు తీర్పు ప్రకారం పరిహారానికి వినతి

పన్నెండేళ్ల వయసు ఉన్న తమ కుమార్తె బొంత లక్ష్మీ నరసమ్మను ఐదేళ్ల క్రితం ఆటోడ్రైవర్ అత్యాచారం చేసిన ఘటనలో గుంటూరు పోక్సో కోర్టు తీర్పు ప్రకారం రూ.4 లక్షలు పరిహారం అందజేయాలని దుర్గికి చెందిన మృతురాలి తల్లి బొంత ఎసమ్మ జాయింట్ కలెక్టర్‌కు విన్నవించారు. ఈ ఘటనతో మానసికంగా కుంగిపోయిన తమ కుమార్తె అనా రోగ్యంతో మృతి చెందిందని, నిందితుడికి శిక్ష విధించాలని కోర్టును ఆశ్రయించగా, నష్టపరిహారం అందజేయాలని కోర్టు తీర్పు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

జగనన్న కాలనీ కోసం స్థలమిస్తే డబ్బు ఇవ్వట్లేదు



తమ గ్రామంలో జగనన్న కాలనీ ఏర్పాటు నిమిత్తం తనకు వారసత్వంగా సంక్రమించిన 0.77 సెంట్ల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసిన ప్రభుత్వం మూడేళ్లు గడుస్తున్నా ఆ డబ్బులు ఇవ్వడం లేదని క్రోసూరు మండలంలోని పారుపల్లికి చెందిన యనుబర్ల చిన్న కోటయ్య ఫిర్యాదు చేశారు. స్థలం కొనుగోలు వ్యవహారం మాట్లాడిన క్రోసూరు తహశీల్దార్, గ్రామ రెవిన్యూ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా న్యాయం జరగడం లేదని, తనకు ఆధారం ఆ భూమేనని పేర్కొన్నారు. ప్రస్తుతం తనకు అప్పులు ఉన్నాయని అప్పుల వాళ్ల ఒత్తిడి తట్టుకోలేక పోతున్నానని ప్రభుత్వం స్పందించి తనకు రావాల్సిన రూ.18 లక్షలు అందజేసి ఆదుకోవాలని వేడుకున్నారు.

ఇంటి స్థలం కోసం వికలాంగుడి వినతి



తనకు ఇంటిస్థలం కేటాయించాలని, బి.ఎ.,బి.ఇ.డి., పూర్తి చేసిన తనకు ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ పెదకూరపాడుకు చెందిన వికలాంగుడు ఎం. ప్రకాష్ అధికారులను వేడుకున్నారు. కుటుంబంలో తల్లిదండ్రుల పేర్లతో పాటు తన పేరు రేషన్ కార్డులో ఉండడం వలన ప్రభుత్వ పరంగా పెన్షన్ తప్ప ఎటువంటి సంక్షేమ పథకాలు తనకు దక్కలేదని, ఆదుకోవాలని కోరారు.

కలెక్టర్ చెప్పినా పట్టించుకోలేదు..



దాచేపల్లి మండలంలోని తంగెడలో ఉన్న భవ్య సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం తమ భూములలోకి వెళ్లేందుకు ప్రభుత్వం నిర్మించిన బాటను సైతం కలుపుకొని ఫెన్సింగ్ వేశారని, దీంతో, తాము ఇబ్బందులు పడుతున్నామని చిన్న, సన్నకారు రైతులు గుంజి వెంకయ్య, మల్లేశ్వరరావు, నాగబ్రహ్మాచారి, నరేంద్ర ఫిర్యాదు చేశారు.సిమెంట్ ఫ్యాక్టరీ నుండి వచ్చే కాలుష్యంతో పంటలు పండే పరిస్థితి లేదని కనీసం బాట అయినా ఇప్పించాలని కోరుతూ 2009 నుండి కోర్టుల చుట్టూ తిరుగుతున్నామని, గత ఏడాది నుండి కలెక్టర్‌ను అనేక సార్లు కలిసి సమస్య విన్నవించామని, న్యాయం చేయాలని కంపెనీ ప్రతినిధులతో చెప్పినప్పటికీ ఫలితం లేకపోవడంతో మళ్లీ ఫిర్యాదు చేసేందుకు వచ్చినట్లు రైతులు చెప్పారు.

ప్రజాశక్తి
గుంటూరు 5
మంగళవారం 9 మే 2023

సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఎఎన్ఎంల సమస్యలపై ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు స్పందనలో అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శెట్టిపల్లి సతీష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ నాగూర్ షరీఫ్ మాట్లాడుతూ గర్భిణీల సంరక్షణ, శిశు జననం, పోషకాహారం, అంటు వ్యాధులు, ఏఎన్‌సి రిజిస్ట్రేషన్, ఇమ్యునైజేషన్ వంటి విధులు నిర్వహించాల్సి ఉందని, కానీ వారికి అనుభవం లేని, సంబంధం లేని విధులను ఎంపిడిఒలు కేటాయిస్తున్నారని తెలిపారు. ఆరోగ్య సంబంధమైన విధులు చేయాల్సిన వారితో హౌసింగ్ మోటివేషన్, ఆయుష్మాన్‌భారత్ సర్వే, రోజూ మూడు గంటలపాటు స్పందన సమీక్ష వంటి విధులు చేపడుతున్నారన్నారు. కావున వారి సమస్యలను పరిష్కరించాలని నాయకులు కోరారు.కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు డి.ధనంజయ నాయక్, సంయుక్త కార్యదర్శి ఏ.శ్యాంసుందర్ శ్రీనివాస్, కె.ఎన్ .సుకుమార్, గుంటూరు నగర అధ్యక్షులు ఎస్ పి ఎస్ సూరి, కార్యదర్శి చింతల కళ్యాణ్ కుమార్ పాల్గొన్నారు.

అవినీతి అధికారుల్ని బదిలీ చేయాలి

పెదనందిపాడు మండలంలో దీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న అవినీతి అధికారుల్ని బదిలీ చేయాలని సుభిక్ష సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు సీతారామయ్య స్పందనలో అర్జీ అందజేశారు. మండలంలోని కొందరు అధికారులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా దీర్ఘకాలంగా విధుల్లో కొనసాగుతున్నారని ప్రతి మూడేళ్లకు ఒకసారి జరగాల్సిన బదిలీలు అమలు కావడం లేదన్నారు.

గుంటూరు జిల్లా స్పందనకు 138 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న జెసి

ప్రజాశక్తి-గుంటూరు

పరిష్కరించిన ఫిర్యాదులు తిరిగి రీఓపెన్ కాకుండా, అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జెసి రాజకుమారి, డిఆర్ఒ కె.చంద్రశేఖర్‌రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లలితా జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 138 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూధనరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు, డిసిహెచ్ఎస్ హనుమంతరావు, డిఈఓ శైలజ, పంచాయతీరాజ్ ఎస్.ఈ గుర్రం బ్రహ్మయ్య, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ లక్ష్మీ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులను సురక్షితంగా తీసుకురావాలి : టిడిపి



మణిపూర్ నుండి చిట్ట చివరి విద్యార్థిని సురక్షితంగా రాష్ట్రానికి తీసుకొచ్చే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని, ప్రతి జిల్లా కలెక్టరేట్లలో ప్రత్యేక హెల్ప్ లైన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయికృష్ణ అన్నారు. మణిపూర్‌లో రిజర్వేషన్ కోసం జరుగుతున్న గొడవల్లో హింసాత్మక ఘటనల నేపథ్యంలో ఆ రాష్ట్రంలో భయం గుప్పిట్లో బతుకుతున్న ఎన్ఐటి, ఐఐటి, సెంట్రల్ యూనివర్సిటీలలో చదువుతున్న ఆంధ్రప్రదేశ్ కు సంబందించిన తెలుగు విద్యార్థులను వెంటనే రాష్టానికి యుద్ధ ప్రాతిపదికన తీసుకురావాలని డిమాండ్ చేస్తూ జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రావిపాటి సాయికృష్ణ ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్‌లో జెసి రాజకుమారికి వినతిపత్రం అందచేశారు. కార్య క్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు షేక్.ఫిరోజ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంచుమర్తి శేషు, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు గుత్తికొండ కిరణ్ యాదవ్ పాల్గొన్నారు.

జిజిహెచ్ ముఖ ద్వారం ఏర్పాటు కోసం వినతి



ప్రజాశక్తి-తెనాలి: డెల్టా ప్రజలకు తలమానికంగా ఉన్న తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు ప్రత్యేకంగా ముఖద్వారం ఏర్పాటు చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ అన్నారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణికి సోమవారం నాయకులు కె రవికుమార్, పి జోనేష్, శెట్టి ఏసోబులతో కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబుప్రసాద్ మాట్లాడుతూ గతంలో పట్టణ నడిబొడ్డున ఉన్న ఆసుపత్రిని ఆధునీకరణ నిమిత్తం, అత్యాధునిక సౌకర్యాలు అందించేందుకు చెంచుపేట ప్రాంతానికి తరలించారని, కరోనా సమయంలో ఎంతో మందికి వైద్యసేవలందించారన్నారు. అయితే తెనాలి-గుంటూరు రోడ్డు మార్గం నుంచి ఆసుపత్రికి వేళ్లే రోడ్డు వద్ద ఎలాంటి బోర్డు లేకపోవటం బాధాకరమన్నారు. తెనాలి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఆసుపత్రికి చేరుకునే వారి సౌకర్యార్థం రోడ్డు వెంట కనిపించే విదంగా ఓ ఆర్చ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

జిఎంసి స్పందనకు 45 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజల నుండి సమస్యలపై అందే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో స్పందన నిర్వహించారు. కమిషనర్ తొలుత గతవారం స్పందన ఫిర్యాదుల పరిష్కారం, స్పందన పోర్టల్, ఈ.ఆర్.పి., వాట్స్ అప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదుల పై అధికారులతో, సంబందిత కార్యదర్శులతో సమీక్షించి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 18, ఇంజినీరింగ్ విభాగం 13, ఉపాసెల్‌కు 1, అకౌంట్స విభాగానకిఇ 1, పరిపాలన విభాగానికి 6, మొత్తం 45 అర్జీలు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, , టి.వెంకట కష్ణయ్య, ఎస్.ఈ. భాస్కర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గుంటూరులో అర్జీలు స్వీకరిస్తున్న నగర కమిషనర్

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్

పొన్నూరు మండల తాసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఐదు అర్జీలు అందినట్లు శ్రీకాంత్ కేదార్నాద్ తెలిపారు. నివాస స్థలం, పొలానికి దారి ఏర్పాటు, కదరి పట్టణంలో బాబా దర్గా దగ్గర ఫ్తై ఓవర్ బ్రిడ్జి నిలుపుదల కొరకు, ఇంటికి దారి ఏర్పాటు, రెవెన్యూ దరఖాస్తుల పేర్ల మార్పు ఐదు అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. ఈ సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీవో మారుతి శేషమాంబ డేగల వెంకట్రామయ్య సిడిపిఓ వెంకటరమణ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి కొండా రామిరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు :సిపిఎం సీనియర్ నాయకులు కొండా రామిరెడ్డిగారి 5వ వర్ధంతి సభ పాత గుంటూరులోని సిఐటియు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. తొలుత రామిరెడ్డి చిత్రపటానికి పాత గుంటూరు పార్టీ నాయకులు తాడిబోయిన శ్రీనివాసరరావు పూలదండ వేసి నివాళులు అర్పించారు.పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు లక్కా అరుణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సిపియం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ కొండా రామిరెడ్డి గుంటూరు నగరంలో ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ (ఆటో) వర్కర్స్ యూనియన్, ముఠా వర్కర్స్ యూనియన్ నిర్మించటంలో ప్రముఖ పాత్ర వహించారు అని, ఆయన జీవితాంతం నిరాడంబరంగాను, కార్మికుల శ్రేయస్సు కోసం పనిచేశారని చెప్పారు. పార్టీ నగర కార్యదర్శిగా గుంటూరు నగరంలో పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. పాత గుంటూరు శ్రామిక నగర్‌లో పేదలకు ఇళ్ళ స్థలాలు ఇప్పించారని, అలాగే గుంటూరు నగరంలో పేదలకు ఇండ్ల స్థలాలు కల్పించాలని జరిగిన పోరాటంలో జైలు శిక్ష కూడా అనుభవించా రన్నారు. చివరి శ్వాస వరకూ పార్టీ పట్ల అంకిత భావంతో పనిచేశారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె శ్రీనివాసరావు, నగర కమిటీ సభ్యులు షేక్.ఖాశిం షహీద్, మహిళా సంఘం సభ్యులు మారిశెట్టి కృష్ణ కుమారి పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన సభలో కానాల గంగాధరరావు, టి.శ్రీనివాస్, కార్తీక్, రాము, నటరాజ్, కార్తీక్ ప్రసంగించారు.



రామిరెడ్డి సంస్మరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కె నళినికాంత్



నివాళులర్పిస్తున్న ముఠా వర్కర్లు

ముఠా వర్కర్స్ యూనియన్ నివాళి : స్థానిక మస్తాన్‌దర్గా సెంటర్‌లోని కలప అడితీల వద్ద గుంటూరు ముఠా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రామిరెడి వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత ముఠా కార్మికుడు ఎస్.కె.జిలానీ రామిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు నాయకులు షేక్.ఖాసిం షహీద్, ముఠా వర్కర్ వలి, బండి వెంకటేశ్వర్లు, ఎస్కె సుబాని పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న సాంబిరెడ్డి, రైతులు

దెబ్బతిన్న పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-తెనాలి: ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి జొన్న, మొక్కజొన్న, పసుపు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఏపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి ఎమ్మెల్యేను కోరారు. వర్షాలకు తడిసిన దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సోమవారం రూరల్ గ్రామం కఠెవరంలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతు సంఘం ప్రతినిధి బృందం ఎమ్మెల్యేకు సమస్యలను వివరించారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఆయనకు చూపారు. ఎకరానికి రూ.30 నుంచి రూ.32వేల వరకు కౌలు చెల్లించి, దాదాపు రూ.30వేల వరకూ పెట్టుబడి పెట్టిన రైతులు నష్టపోయారని వివరించారు. పసుపు రైతులు రూ.1.75లక్షలు పెట్టుబడి పెట్టి సగానికి పైగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. పసుపుకు మద్దతు ధర ప్రకటించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండు మూడు రోజుల్లో ప్రభుత్వ మార్గదర్శకాలు రానున్నాయని, సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామన్నారు. తెనాలి, గుడివాడ, కొలకలూరు ఆర్‌బికెల్లోనూ రైతు సంఘం వినతపత్రాలను అందించింది. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ముద్దన సాంబశివరావు, రైతులు జి.గోపించంద్, కె.రంగారెడ్డి, వి.రోశయ్య, మహ్మద్ జాన్, ఎమ్మెల్యేతో పాటు మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్ సాగర్, ఎంపిపి చెన్నబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఇళ్ల స్థలాల లేఅవుట్ల పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సిఆర్‌డిఎ పరిధిలో ఐనవోలు, కృష్ణాయపాలెం, నవులూరు, నిడమర్రు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకం లే ఔట్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి , అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) శివనారాయణ శర్మతో కలసి పరిశీలించారు. లే ఔట్లలో జంగిల్ క్లియరెన్స్, లెవలింగ్, అంతర్గత రహదారుల ఏర్పాటు, ఇంటి స్థలాల మార్కింగ్ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించి పనులు నిర్దేశిత సమయానికి పూర్తి అయ్యేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళికా ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి మీడియా మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాల మంజూరుతో పాటు, ఇళ్ల నిర్మాణాల కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా జరుగుతుందన్నారు. జిల్లాలో సిఆర్‌డిఎ పరిధి మినహా మిగతా ప్రాంతాల్లో ఇంటి స్థలాల పంపిణీ జరిగిందని, ఇళ్ల నిర్మాణాలు మంజూరు చేయడంతో వివిధ దశల్లో నిర్మాణాలు ఉన్నాయన్నారు. సిఆర్‌డిఎ పరిధిలో ఇల్లు లేని వారికి ఇంటి స్థలాల కేటాయింపు గౌరవ హై కోర్ట్ ఉత్తర్వుల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం గుంటూరు, ఎన్‌టీఆర్ జిల్లాలకు సంబంధించి నిడమర్రు, కృష్ణాయపాలెం, కురగల్లు, ఐనవోలు, మండడం తదితర గ్రామాల్లో 20 లే ఔట్లలో పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. లే ఔట్ అభివృద్ధి పనులు, ఫ్లాట్ల మార్కింగ్ పనులు మే 15 నాటికి పూర్తి చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. ఎంటిఎంసి, పెదకాకాని మండలంలోని కొన్ని గ్రామాల ప్రజలకు ఇక్కడ ఇంటి స్థలాలు కేటాయించనున్నామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం.వెంకట శివరామి రెడ్డి, ట్రైనీ కలెక్టర్ మోవిడి వాణి, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ హరిహరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

కనీస మద్దతు ధరకు అమ్ముకోవాలి

ప్రజాశక్తి-నరసరావుపేట

అకాల వర్షానికి మండలంలోని పాలపాడు గ్రామ రైతు భరోసా కేంద్ర పరిధిలో దెబ్బ తిన్న మొక్కజొన్న పంటలను జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తో కలసి పల్నాడు జిల్లా ప్రత్యేక అధికారి, పంచాయతి రాజ్, గ్రామీణాభివృద్ధి కమి షనర్ సూర్యకుమారి సోమవారం పరిశీలించారు.తడిసిన మొక్కజొన్న కండెలను పరిశీలించి స్థానిక రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఆమె రైతులతో మాట్లాడుతూ ధాన్యం ధర బహిరంగ మార్కెట్ లో ఎంత ఉందో వివరాలు అడిగి తెలుసుకొన్నారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం సూచించిన కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని అమ్ము కోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, జిల్లా హార్టికల్చర్ అధికారి బెన్ని, ద్వామా పి.డి జెసేఫ్ కుమార్ పాల్గొన్నారు.


దెబ్బతిన్న మొక్కజొన్న ను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి సూర్యకుమారి, జెసి శ్యాంప్రసాద్ తదితరులు

మిరప విత్తనాలను ఆర్‌బికే ద్వారా అందించాలి

ప్రజాశక్తి-పెదకూరపాడు

మిరప విత్తనాలను రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించాలని రైతు సంఘం పెద్దకూరపాడు మండల శాఖ తహశీల్దార్ క్షమారాణి కి సోమవారం వినతిపత్రం అందించారు. గత మూడేళ్ల నుంచి కొన్నిచోట్ల నాణ్యతలేని విత నాలు వచ్చాయని వివరించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఆర్ బి కే ల ద్వారా విత్తనాలు అందించేందుకు సిఫారసు చేస్తానన్నారు. రైతు సంఘం పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి డి.ఎస్.రావు, అమరయ్య, సలాం పాల్గొన్నారు.

విద్యా వ్యాపారాన్ని అరికట్టండి: ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-వెల్దుర్తి

విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ పాఠశాలలపై ప్రత్యేక దృష్టిపెట్టి విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి రాజు కోరారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించిన ఉచిత సీట్లను పక్కాగా అమలు చేయాలని, కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో పేద మధ్య తరగతి వెనకబడిన వర్గాలకు 25 శాతం ఉచిత విద్య సీట్లు కేటాయించాలని అన్నారు. అదేవిధంగా వేసవి సెలవుల్లో కూడా తరగతుల నిర్వహిస్తున్న కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారంలో అధికారుల వైఫల్యం: టిడిపి

ప్రజాశక్తి-నరసరావుపేట

స్పందన కార్యక్రమంలో వచ్చిన సమస్యలు పరి ష్కరించడంలో జిల్లా యంత్రాంగం ఘోరంగా వైఫల్యం చెందిందని, అనేక సమస్యలను కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన లేదని నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నియోజకవర్గంలోని పలు సమస్యలపై సోమవారం స్పంద నలో ఆయన ఫిర్యాదు చేశారు. పట్టణంలో పారిశుధ్య పనుల పై కూడా అధికారుల నుంచి స్పందన లేకపోవటం బాధాకరమన్నారు. నియోజకవర్గంలో ఓటర్ లిస్ట్ లో 12 వేలకు పైగా మృతుల ఓట్లు ఉన్నాయని వాటి తొలగింపు పై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవటం లేదన్నారు.

భర్త డెత్‌బెనిఫిట్స్ కోసం వినతి



వెల్దుర్తి మండలం ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎం.పి.హెచ్.ఈ.ఓ గా పని చేస్తున్న తన భర్త కటారి సాంబశివరావు 2017 లో మృతి చెందారని, డెత్ బెనిఫిట్స్ కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్న ఫలితం లేదని భార్య కటారి చంద్రకళ కలెక్టర్ 'స్పందన'లో ఫిర్యాదు చేశారు.దుర్గి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న కాకర్ల సుశీల అధికారులకు నోటీసులు ఇస్తూ తనకు భర్త నుండి రావాల్సిన డెత్ బెనిఫిట్స్ కు ఆటంకాలు కలిగిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని యుడిసి అధికారులు ఆమెకు మద్దతు తెలుపుతున్నారని, సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

శబ్ద కాలుష్యంతో ఇబ్బందిపై ఫిర్యాదు



కోటప్పకొండ రోడ్డు లోని సాంబశివరావు పేటలో ఉన్న బీరువాల కం పెనీ నుండి వెలువడు తున్న వాయు కాలుష్యం నివారణకు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసులు కలెక్టర్ 'స్పందన'లో ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంతంలో 40 ఏళ్ళ నుండి నివాసాలు ఏర్పరచుకొని ఉంటున్నామని ఇటీవల కాలంలో తమ గృహాల కు సమీపంలో ఏర్పాటు చేసిన బీరువా కంపెనీల నుండి వెలు వడుతున్న శబ్దాలతో ఇబ్బందులు పడుతు న్నట్లు చెప్పారు. మున్సిపల్ అధికారులకు సచివాలయ సిబ్బంది కి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆ ప్రాంతానికి చెందిన సయ్యద్ మహబూబ్ హుస్సేన్, కె.ఝాన్సీ, షేక్. నాగూర్ షరీఫ్, ఫాతిమున్నిసా, అంజమ్మ, షేక్ సుభాని ఫిర్యాదు చేశారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-ఈపూరు

మొక్కజొన్న సాగు చేసిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో వారి పేర్లను నమోదు చేసుకోవాలని తహశీల్దార్ ఆర్.వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు లో వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మొక్కజొన్న రైతులు ఎవరు అధైర్య పడవద్దని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు చేస్తుందన్నారు. మండల వ్యవసాయశాఖాధికారి ఆర్.రామారావు మాట్లాడుతూ మొక్కజొన్న పంట శాంపిల్స్ పరి శీలించిన తర్వాత రైతుల నుంచి కొనుగోలు సేకరణ జరుగుతుందని, మార్క్ ఫెడ్ అనుమతులు రాగానే రైతులకు నేరుగా కొనుగోలు తేదీ మెసేజ్ ద్వారా వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జి బొల్లా వెంకట రాధాకృష్ణ, సీఈఓ పోకా కోటేశ్వరరావు, మండల వ్యవసాయ విస్తరణ అధికారి బి.అప్పారావు పాల్గొన్నారు.


మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహశీల్దార్ ఆర్.వెంకటేశ్వర్లు నాయక్

తడిసిన పంటలను వెంటనే కొనుగోలు చేయండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

అకాల వర్షాలకు తడిసిన వరి, మిర్చి, మొక్క జొన్న, పంటలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదు కోవాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు సత్తెనపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. టిడిపి పల్నాడు జిల్లా ఉపా ధ్యక్షులు సయ్యద్ పెదకరిముల్లా మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని చెప్పుకొనే వైసీపీ ప్రభుత్వం రైతుల గురించి పట్టించుకోవటం లేదని అన్నారు. అనంతరం తహశీల్దార్ కె.నగేష్‌కు వినతిపత్రం అందజేశారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక పండరీపురం రెండో లైన్లోకి తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో వరి,కొన్ని కొన్ని ప్రాంతాల్లో మొక్కజొన్న, మిర్చి, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని అన్నారు.

లబ్ధిదారులను కలిసిన మున్సిపల్ చైర్మన్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న వారిని కలిసి వారికి కావాల్సిన మౌలిక సదుపాయాల విషయమై వారిని సోమవారం అడిగి తెలుసుకున్నట్లు మున్సి పల్ చైర్మ న్ షేక్ రఫాని అన్నారు. లబ్ధిదారులందరూ అన్ని సౌకర్యాలు బాగున్నట్లు చెప్పారని అన్నారు. మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో త్వరలో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. స్థానిక 33 వ వార్డులో సాయి కార్తీక్ థియేటర్ వద్ద డ్రైనేజీ పనులు జరుగుతు న్నందున వీటిని పరిశీలించినట్లు చెప్పారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి - మాచర్ల

విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసుకునేందుకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి అన్నారు స్థానిక ప్రభుత్వ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను ఆయన సోమవారం ప్రారంభించారు. కారక్రమంలో యుటిఎఫ్ నాయకులు కిరీట్ రెడ్డి ఆయేషా బేగం తదితరులు పాల్గొన్నారు. **చిలకలూరిపేట:** స్థానిక శాఖా గ్రంథాల యంలో 40 రో జుల పాటు జరగనున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం సోమవారం ప్రారంభ మైంది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర అధికార భాషా సం ఘం సభ్యులు డాక్టర్ కత్తి వెంక టేశ్వర్లు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు డాక్టర్ పివి సుబ్బారావు ప్రారం భించారు. తొలి రోజు శిక్ష ణను బాల సాహితీ వేత్త దార్ల బుజ్జిబాబు నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక ట్రెజరర్ ఎ.గురులింగం, వైఎంసిఎ అధ్యక్షులు చుక్కా విన్సెంట్ పాల్, గ్రంథాలయ ఇన్‌ఛార్జి అధికారి ఎమ్. నాగుల్ మీరావలి పాల్గొన్నారు. **రొంపిచర్ల:** మండలం లోని సంతగుడిపాడు, రొంపిచర్ల శాఖా గ్రంథా లయాలలో సోమవారం నుండి వేసవి శిక్షణా శిబి రాలు ప్రారంభమయ్యాయి. సంతగుడి పాడు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరాన్ని ప్రముఖ కవి సుబ్బారావు ప్రారంభించారు.


మాట్లాడుతున్న మాచర్ల మున్సిపల్ చైర్మన్ బి.రఘురామిరెడ్డి

జీతాలివ్వకపోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల


మాట్లాడుతున్న షేక్ శిలార్ మసూద్

మండలం తమ్మలచెరువు గ్రామంలో గత నాలుగు రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ షేక్ శిలార్ మసూద్ హాజరై మాట్లా డుతూ పారిశుధ్య కార్మికులు గత ఏడు నెలల నుంచి జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పట్టి పట్టినట్టుగా వ్యవహరిస్తుందని స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ అని చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వానికి సిగ్గుచేటని విమర్శించారు. సంబంధిత అధికారులు, గ్రామ సర్పంచ్ వెంటనే స్పందించి జీతాల సమస్యను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు టి. మల్లయ్య, వై.యోహాన్ సమ్మెకు మద్ద తు తెలిపారు. గ్రామపంచాయతి కార్మికులు బి.రాజేష్, జి. సుందర్రావు, టి. సల్మాన్, బి.సుందర్రావు పాల్గొన్నారు.

పేటసన్నేగండ్ల సర్పంచ్‌గా నాగేంద్రం

ప్రజాశక్తి-కారెంపూడి



పార్టీనీ కష్టకాలం నుండి కని పెట్టుకొని ఉన్న వారికే అరుదైన పద వులు దక్కుతా యని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పేటసన్నేగండ్ల సర్పంచ్‌గా ప్రమా ణ స్వీకారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇప్పటి వరకు సర్పంచ్‌గా ఉన్న ఉన్నం సాహితీప్రియ దీర్ఘకాలపు సెలవు పెట్ట డంతో ఉపసర్పంచ్‌గా ఉన్న జవ్వాజి నాగేంద్రం సర్పంచ్ బాధ్యతలు స్వీక రించారు. కార్యక్రమంలో ఎంపిపి మేకల శారద శ్రీనివాస్ రెడ్డి జడ్పి టిసి షేక్ షఫీ,వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అక్బర్ జానీ బాషా, మండల పార్టీ కన్వీనర్ కొంగర సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గంగలకుంట అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-వెల్దుర్తి: గ్రామం అభివృద్ధికి కృషి చేస్తానని మండలంలోని గంగలకుంట సర్పంచ్ కంపసాటి శివయ్య అన్నారు.గ్రామంలోని సమస్యలను పరిష్కరించి గ్రామం అభివద్ధికి కృషి చేస్తానని శివయ్య తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి

ప్రజాశక్తి-వెల్దుర్తి: అకాల వర్షం వలన మండల పరిధిలోని గ్రామాలలో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని మాచర్ల ఏరియా సిపిఐ కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి అన్నారు. నష్టపోయిన పంటల వివరాలను సేకరించి ప్రభుత్వ పరంగా నష్టపరిహారం రైతులకు అందే విధంగా చూడాలని కోరారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

ప్రజాశక్తి-ఈపూరు: ఖరీఫ్ సాగు సమాయత్తం కార్యక్రమంలో భాగంగా సాగు మొదలయ్యే ముందు రైతులకు అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచామని ఏవో ఆర్.రామారావు సోమవారం తెలిపారు. మండలంలోని బొమ్మరాజు పల్లి, ఇనిమెళ్ళలలో ఖరీఫ్ సాగు సమాయత్తం కార్యక్రమంలో సోమవారం ఆయన మాట్లాడుతూ పచ్చి రొట్ట విత్తనాలతో పాటు ప్రధాన పంటల విత్త నాలు, ఎరువులు రైతు భరో సా కేంద్రాలలో అందుబాటులో ఉంచుతామన్నారు. **సత్తెనపల్లిరూరల్:** వేసవిలో లోతుగా దుక్కులు దున్నుకోవటం వలన భూమి లోపల ఉన్న కీటకాలను సమూలంగా నాశనం చేసేందుకు వీలుంటుందని పల్నాడు జిల్లా రిసోర్స్ సెంటర్ వ్యవసాయ సహాయ సంచాలకురాలు శివకుమారి రైతులకు వివరించారు. సత్తెనపల్లి మండలం భట్లూరు, కట్టమూరు గ్రామాల్లో వ్యవసాయ అధికారులు రైతులతో సమావేశం నిర్వహించారు. **బెల్లంకొండ:** మండలంలోని బెల్లంకొండ, నాగిరెడ్డిపాలెం గ్రామాలలో సాగుకు సమాయత్తం ఖరీఫ్-2023 కార్యక్రమం నిర్వహించారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
మంగళవారం 9 మే 2023


తుళ్ళూరులో ధర్నా చేస్తున్న కార్మికులు


నెక్కల్లులో నిరసన తెలుపుతున్న కార్మికులు

సూపర్‌వైజర్‌ల వేధింపులు ఆపాలని కార్మికుల ధర్నా

- వేధింపులు తాళలేక పని మానేసి ఇంటికి వెళ్లిన కార్మికులు
- నెక్కల్లు, తుళ్లూరులో కొనసాగుతున్న నిరసన ప్రదర్శనలు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికుల ఆందోళనలు కొనసాగుతున్నాయి.సిఆర్‌డిఎ సూపర్ వైజర్‌ల వేధింపులకు వ్యతిరేకంగా సోమవారం తుళ్లూరులో పని విరామ సమయంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. నెక్కల్లులో పనులు మానివేసి నిరసన తెలిపారు.కార్మికుల నిరసనల నేపథ్యంలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి తుళ్లూరులో ఒక ప్రకటనలో మాట్లాడుతూ సోమవారం నెక్కల్లులో పారిశుధ్య విధులు నిర్వర్తిస్తున్న కార్మికులపై సూపర్ వైజర్ మన్మధరావు వేధింపులకు పాల్పడటంతో పని మానేసి కార్మికులు ఇళ్లకు వెళ్లిపోయారని రవి తెలిపారు.ఇద్దరు మహిళా కార్మికులు తుళ్లూరులోని చెత్తడంప్‌కు వెళ్లి పని చేస్తామని చెప్పగా ఒక మహిళా కార్మికురాలే వెళ్ళాలని,తను చెప్పిందే చేయాలని సూపర్ వైజర్ మన్మధరావు పంతం పట్టాడని చెప్పారు. తన ఆదేశాలను అమలు చేయకపోతే పనిలో లేనట్టుగా పరిగణిస్తామని బెదిరింపులకు దిగాడని,ఇది మంచి పద్ధతి కాదన్నారు.గత బుధవారం పనిచేయటానికి తుళ్లూరు వెళ్లిన అనంతవరం గ్రామానికి చెందిన కార్మికుడు శేషయ్యను విధుల్లోకి వెళ్లనీకుండా అడ్డుకొని అకారణంగా శేషయ్యను పనికిరావద్దంటూ సూపర్ వైజర్ హుకుం జారీ చేశాడని చెప్పారు.ఈ వేధింపులకు నిరసనగా గత శనివారం నుంచి పని విరామ సమయంలో పారిశుధ్య కార్మికులు నిరసన తెలుపుతున్నారని చెప్పారు. కో-ఆర్డినేటర్ నరసింహారావు, కొందరు సూపర్ వైజర్‌ల వేధింపులు తట్టుకోలేక పోతున్నామంటూ పారిశుధ్య కార్మికులు వాపోతున్నారని రవి చెప్పారు. కార్మికులపై వేధింపులు ఆపాలని కోరుతూ విజయవాడ సిఆర్‌డిఎ అధికారులకు కార్మిక సంఘం నాయకులు అర్జీ అందజేయడం జరిగిందన్నారు. అయినప్పటికీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. .మన్మధరావు తను బాధ్యత వహిస్తున్న రెండు గ్రామాల్లో కార్మికులకు ఇచ్చే ఈఎస్‌ఐ ఫారాలు తప్పులతడకలుగా పంపించాడని,గుంటూరు జిల్లాకి బదులు అనంతపురం జిల్లా అని, మహిళా కార్మికులను మగవాళ్ళుగా,పెళ్లయిన వారిని పెళ్లి కాని వారిగా చూపిస్తూ ఇచ్చిన ఈఎస్‌ఐ కార్డులు పని చేయక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.సూపర్ వైజర్ ఈఎస్‌ఐ ఫారాలలో కార్మికుల వివరాలు తప్పుగా నమోదు చేయడం వల్ల కార్మికులు గుణదల ఈఎస్‌ఐ హాస్పిటల్‌కు వెళ్లి వెనుతిరిగి వస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా కార్మికులపై తీవ్రమైన వేధింపులకు పాల్పడుతున్న మన్మధరావుపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని రవి కోరారు.లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని రవి హెచ్చరించారు.

రేపు వీఆర్‌ఏల నిరాహార దీక్ష

ప్రజాశక్తి-కొల్లిపర: వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10వ తేదీన విజయవాడ అలంకార్ సెంటర్ వద్ద జరిగే రిలే నిరాహార దీక్షకు మండలంలోని వీఆర్‌ఏలు హాజరుకావాలని వీఆర్‌ఏల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కురగంటి సంగయ్య కోరారు. సోమవారం తహశీల్దార్‌కు రిలే దీక్షకు అనుమతి కోరుతూ తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సంగయ్య మాట్లాడుతూ వీఆర్‌ఏలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, భూ సర్వే సందర్భంగా వీఆర్‌ఏలకు టిఏడిఏలు ఇవ్వాలని,అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వీఆర్‌ఏలకు వర్తింపజేయాలని అన్నారు. డిఏ రికవరీ ఆపి డిఏతో కూడిన వేతనం ఇవ్వాలని, నామినీ లుగా పనిచేస్తున్న వారినే వీఆర్‌ఏలుగా నిర్మించాలని వినతి పత్రంలో కోరారు. షేక్ హైర్‌పాల్, సుభాని వీఆర్‌ఏలు పాల్గొన్నారు

దుర్గగుడి చైర్మన్‌పై అనుచిత వ్యాఖ్యలకు ఖండన

ప్రజాశక్తి -మంగళగిరి:విజయవాడ దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబుపై జనసేన నాయకులు పోతిన మహేష్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని మంగళగిరి గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం నాయకులు ఖండించారు. సంఘం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం అధ్యక్షులు పందేటి సాంబశివరావు మాట్లాడుతూ దుర్గ గుడి చైర్మన్ రాంబాబుని రౌడీషీటర్, 420 అనడం మహేష్‌కి సరైంది కాదన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి మూడు నెలల అయినా నిండని రాంబాబుపై అంత అక్కసు ఏమిటని ఆయన అన్నారు. పోతిన మహేష్ బేషరతుగా చైర్మన్ రాంబాబుకి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జె.ఏడుకొండలు, కె. శివ సత్యనారాయణ, జి. రాజారావు, కె. గోపిబాబు, కె. శ్రీనివాసరావురెడ్డి పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్ :ఎంపీడీవో శేషమాంబ వేసవిలో ప్రయాణికులు, పాదాచారుల దాహార్తి తీర్చేందుకు రెవెన్యూ శాఖ ముందుకు వచ్చి చలివేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయమని పొన్నూరు మండల ఎంపీడీవో భవనం మారుతి శేషమాంబ అన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. తహశీల్దార్ శ్రీకాంత్ కేదార్నాథ్ మాట్లాడుతూ చలివేంద్రాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆయన కోరారు. మొదటి రోజు ప్రయాణికులు, ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. డిప్యూటీ తహశీల్దార్ ఎన్. వాసు, ఇఓపిఆర్‌డి శివ సుబ్రహ్మణ్యం, వ్యవసాయాధికారి డేగల వెంకట్రామయ్య, ఏపిఎం గోపి, సిడిపిఓ వెంకటరమణ, ఆర్‌ఐ రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధికి చలపతిరావు, దావీదుల కృషి మరువలేనిది

26వ వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ప్రజల కోసం నిరంతరం పనిచేసిన డోకిపర్తి చలపతిరావు, చొక్కా దావీదులు ధన్య జీవులని, వారి కృషి మరువలేనిదని సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు అన్నారు. సోమవారం ప్రాతూరి గ్రామంలో మాజీ సర్పంచులు, సిపిఎం నాయకులు డోకిపర్తి చలపతిరావు, చొక్కా దావీదుల 26వ వర్ధంతి సభ, సిపిఎం ప్రాతూరు గ్రామ శాఖ కార్యదర్శి డోకి పర్తి రాజేంద్ర బాబు అధ్యక్షతన జరిగింది. ముందుగా చలపతిరావు, దావీదుల చిత్రపటాలకు సిపిఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ సిపిఎం నాయకులుగానూ, గ్రామ సర్పంచులుగానూ గ్రామ అబివృద్ధి కోసం డోకిపర్తి చలపతిరావు పనిచేశారని అన్నారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టడంలోనూ, ఇసుక క్వారీ కార్మికుల సమస్యల పైన చలపతిరావు పనిచేశారని ఆయన అన్నారు. అదేవిధంగా గ్రామంలో రోడ్లు డ్రైన్లు నిర్మాణం చేపట్టి ప్రజల ఆదరాభిమానాలు పొందారని అన్నారు.


మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు,నాయకులు

అంతేకాకుండా గ్రామంలో సిపిఎం అభివృద్ధి కోసం కృషి చేశారని అన్నారు. ప్రస్తుతం దేశంలో మతోన్మాద బిజెపి ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా పరిపాలన సాగిస్తుందని సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మతోన్మాద బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను రాష్ట్రంలోనూ వైసిపి అనుసరిస్తుందని ఆయన ఎద్దేవా చేశారు. వివక్షకు వ్యతిరేకంగా, దళితులు, పేద ప్రజల సమస్యలు పైన సిపి ఎం పోరాటం చేస్తుందని అయన అన్నారు. ఈ కార్యక్రంలో ఏపి కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి బత్తుల సంసోను, సీపీ ఎం నాయకులు డోకిపర్తి కోటయ్య, దాసరి సురేష్, పుల్లగూర బిక్షాలు, రవి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

18న గ్రామపంచాయతీ కార్మికుల ఛలో గుంటూరు

ప్రజాశక్తి-దుగ్గిరాల

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి మే 18న జరిగే ఛలో గుంటూరు కార్యక్రమంలో జిల్లాలోని గ్రామపంచాయతీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గుంటూరు జిల్లా గౌరవ అధ్యక్షులు వై నేతాజీ పిలుపునిచ్చారు. ఎస్.సురేష్ అధ్యక్షతన, మండలంలోని చిలువూరులో సోమవారం నిర్వహించిన యూనియన్ జిల్లా సమావేశంలో నేతాజి మాట్లాడుతూ గ్రామ పంచాయితీలలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వారి జీతాలను ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. టెండర్ కార్మికులకు అనేకచోట్ల గత మూడు, నాలుగు ఏళ్లుగా జీతాల పెంపుదల చేయలేదని, పెరుగుతున్న ధరలతో పంచాయితీ కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, వీరందరికీ కనీస వేతనాలు అమలు


సమావేశంలో మాట్లాడుతున్న వై. నేతాజి

చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా కోశాధికారి డి.వి.నరసింహారావు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు ఏటా యూనిఫారం, గుర్తింపు కార్డులు, సబ్బులు, నూనెలు తదితర కనీస సౌకర్యాలు అమలు చేయాలని అన్నారు. జిల్లా నాయకులు పి శ్రీరాములు మాట్లాడుతూ పోరాటాలు చేయడం ద్వారానే ఏ కార్మికులైన సమస్యలు పరిష్కారం చేసుకోగలుగుతారని గ్రామపంచాయతీ కార్మికులు కూడా తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.ప్రసాదు, బి.క్రీస్తుదాసు, ఎం జోసఫ్, కె.ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు

రసాభాసాగా గ్రామ సభ

ప్రజాశక్తి - తాడికొండ :పొన్నెకల్లు గ్రామంలో ప్రభుత్వ మద్యం షాపును అకారణంగా బండారుపల్లి తరలించడంతో మద్యం ప్రియులు సోమవారం పంచాయతీ ఆవరణంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆందోళనకు దిగారు. ఈనెల 1న గ్రామానికి చెందిన పప్పుల సీతారామరెడ్డి పంచాయతీ కార్యాలయంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయాలని ఫిర్యాదు చేసారు. సోమవారం గ్రామసభ నిర్వహించగా సభ రసాభాసగా సాగి వాగ్వాదాలతో ముగిసింది. మా గ్రామంలో మద్యం షాపు వద్దంటూ మహిళలు, కావాలంటూ మగవారు ఆందోళనకు దిగారు. మేము కూలి నాలి చేసుకొని బ్రతికే వారం, రాత్రికి మద్యం తీసుకుంటేనే మరుసటిరోజు పనికి వెళ్లగలమని లేకుంటే వెళ్లలేని పరిస్థితి అని వాపోయారు. గ్రామంలో మద్యం షాపు అకారణంగా ఎత్తివేసారని,షాపు లేకపోవడంతో అదనంగా 100 ఖర్చు చేస్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సభ వాయిదా వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి షేక్ కరీముల్లా తెలిపారు.


రాధాకృష్ణా రెడ్డికు జ్ఞాపిక అందిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

కళాకారుడు రాధాకృష్ణారెడ్డికు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శకపురుషుని శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటర్లో సోమవారం ఎన్టీఆర్ నటించిన ఆప్తమిత్రులు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. రోజుకొక కళాకారులను సత్కరించే కార్యక్రమంలో కొల్లిపర మండలానికి చెందిన పౌరాణిక, సాంఘిక నాటక కళాకారుడు ఆరేమండ రాధాకృష్ణారెడ్డిని ఎరుకలపూడి టీడీపీ నాయకులు పి. రవీంద్ర, కె. శ్రీనివాసరావు, వి.సుబ్బారావు, శివనాగ మల్లేశ్వర రెడ్డి, బి. తాతిరెడ్డి, కె.శ్రీనివాసరావు, పి.దుర్గ తదితరులు ఎన్టీఆర్ జ్ఞాపికను అందజేసి సత్కరించారు. థియేటర్ కమిటీ సభ్యులు పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, డి భవాని, ఎస్ సాంబశివరావు, ఈదర శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జగన్, ఎం రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, కాళహస్తి రఘు, ఎం వెంకట్, ఎన్ శ్రీనివాస్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-దుగ్గిరాల

మండలంలోని ఈమనీలో సొసైటీ ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు సోమవారం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతులందరూ వారి ఆధార్ కార్డు ద్వారా రైతు భరోసా కేంద్రాలలో నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.1962లకు మార్క్ఫెడ్ వారు సొసైటీ ద్వారా కొనుగోలు చేయనున్నారు. తేమ 14 శాతానికి మించి ఉండకూడదనే నిబంధన ఉంది. అమ్మిన పంటకు డబ్బులు నేరుగా రైతు ఖాతాలో జమ చేస్తారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దానబోయిన సంతోష రూప వాణి, జెడ్పిటిసి మేకతోటి అరుణ,తహశీల్దార్ కే.మల్లేశ్వరి, మండల వ్యవసాయ అధికారిన పి. శిరీష, సొసైటీ అధ్యక్షులు నలుకుర్తి ఏసు పాదం, తదితరులు పాల్గొన్నారు.



పిల్లలకు క్రియేటివ్ ఆర్ట్ కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్:రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డ్యూనాంట్ జన్మదినం సందర్భంగా జరిగే రెడ్ క్రాస్ దినోత్సవం సంధర్భంగా చిన్నకాకానిలోని షైన్ ఆనంద ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న అనాథ పిల్లలకు క్రియేటివ్ ఆర్ట్ కిట్లను సోమవారం మంగళగిరి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి ఆద్వర్యంలో పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి మంగళగిరి ప్రెసిడెంట్ తహశీల్దార్ జి. వి. రామప్రసాద్ మాట్లాడుతూ వేసవి సెలవులలో పిల్లలలోని సృజనాత్మకతనూ, కళా నైపుణ్యాన్ని పెంపొందించుకొనుటకు ఈ క్రియేటివ్ ఆర్ట్ కిట్లు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి మంగళగిరి సబ్ బ్రాంచ్ చైర్మన్ ఇసునూరు అనిల్ చక్రవర్తి, సెక్రెటరీ ట్రెజరర్ షేక్ సలార్, ఈసి సభ్యులు జి.శ్రీనివాస్ రావు, ఎ. మురళి, పి.మహేష్‌లు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న వి.శ్రీనివాసరావు, సిహెచ్ బాబూరావు, డి రమాదేవి, వెంకటేశ్వర్లు తదితరులు

మొసలి శివమ్మకు ఘన నివాళులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సిపిఎం సీనియర్ నాయకులు మొసలి పకీరయ్య భార్య, సిపిఎం మంగళగిరి మండల కార్యదర్శి మొసలి జ్యోతిబసు తల్లి అయిన శివమ్మ అనారోగ్యంతో ఇటీవల మరణించిన విషం తెలిసిందే. ఈ నేపథ్యంలో పెదవడ్లపూడి వై గార్డెన్స్‌లో సోమవారం సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పలువురు పూలమాలలేసి నివాళులర్పించారు. వీరిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు సిహెచ్ బాబూరావు, వి.వెంకటేశ్వర్లు, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, కె.నళినీకాంత్, ఎం.రవి, ఎస్ఎస్ చెంగయ్య, ఎన్.భావన్నారాయణ, నాయకులు జొన్న శివశంకర్, జెవి రాఘవులు, డి.వెంకటరెడ్డి, కె.నాగేశ్వరరావు, కె.శివరామకృష్ణయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, నాయకులు చిన్ని తిరుపతయ్య, జె.జాన్‌బాబు, టిడిపి నాయకులు పి.శ్రీనివాసరావు, ఎ.జయసత్య, జె.కిరణ్‌చంద్, ఎం.రమేష్, ఎ.ఉమామహేశ్వరరావు, వైసిపి నాయకులు జి.చిరంజీవి, ఎం.శ్రీనివాసరెడ్డి, వేణుగోపాలరెడ్డి, ఇతర నాయకులున్నారు.





నివాళులర్పిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, పాశం రామారావు, జంగాల అజయ్‌కుమార్, ఇతర నాయకులు

ఐఎఎల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహారావు



ప్రజాశక్తి-గుంటూరు లీగల్

రాజమండ్రిలో గత ఆదివారం నిర్వహించిన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) రాష్ట్ర 11వ మహాసభల్లో గుంటూరు బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది జె.నరసింహారావు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సిద్దా సత్యనారాయణ, పరుచూరి నంద రాష్ట్ర డిప్యూటీ జనలర్ సెక్రెటరీగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు గుంటూరు న్యాయవాదులు వీరికి అభినందనలు తెలిపారు.



సమస్య ఉంటే 9849908384కు వాట్సప్ చేయండి

డయల్ యువర్ మేయర్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగర ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు అన్నారు. సోమవారం మేయర్ ఛాంబర్‌లో నగర ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధించి డయల్ యువర్ మేయర్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఎంపి ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యేలు మహమ్మద్ ముస్తఫా, మద్దాలి గిరిధర్, కమిషనర్ కీర్తి చేకూరి ఆవిష్కరించారు. ప్రజలు తమ స్థానిక మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి 9849908384 నంబర్‌కు ఫొటో కాని, వీడియో కాని, వాట్సప్ ద్వారా వారి పూర్తిపేరు, ఫోన్ నెంబర్, పూర్తి చిరునామాతో తెలియజేస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్యలను వెంటనే పరిష్కారానికి కృషి చేస్తామని మేయర్ మనోహర్ నాయుడు తెలిపారు.

పిల్లల బూట్లు చిరిగితే బాధ్యత మాదా?



ప్రదర్శనలో ఉపాధ్యాయులు

ఇంక్రిమెంట్లు రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఉపాధ్యాయుల నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

క్యుములేటివ్ ఇంక్రిమెంట్లు రద్దు ఉత్తర్వులను తక్షణం ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి చిన్నం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సత్తెనపల్లి, గురజాల, దుగ్గిరాల మండల విద్యాశాఖ అధికారులకు ఫిరంగిపురం మండలంలోని కొంతమంది ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్లు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయటం దుర్మార్గమని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సకాలంలో పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్ పాఠశాలలకు అందచేయకుండా వాటిని సకాలంలో పూర్తి చేయలేదని అధికారులు ఉపాధ్యాయులకు పనిష్మెంట్లు ఎంతవరకు భావ్యమని ప్రశ్నించారు. ఎపిటిఎఫ్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాలకు సరఫరా చేసే బూట్లు, బ్యాగులు, యూనిఫాంలు నాణ్యతలేని కారణంగా చినిగి పోయాయని, వాటికి ఉపాధ్యాయులను బాధ్యులను చేయటం సరికాదని అన్నారు. ఎస్టియు రాష్ట్ర కార్యదర్శి సుభాని మాట్లాడుతూ అధికారులకు ఇచ్చిన అక్రమ బదిలీ ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎంపిడిఒ కార్యాలయం నుండి ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన అనంతరం ఆర్‌డిఒ బిఎస్ఎన్ రాజకుమారికి వినతి పత్రం అందజేశారు. ఠాగూర్, విష్ణు, కె.నరసింహారావు, రెహమాన్, సురేష్, సునీల్ కుమార్, వాసు, బాబు, అగస్టస్ పాల్గొన్నారు.

పిల్లల్లో సృజనాత్మకత పెరిగింది : క్రాంతికార్

ప్రజాశక్తి - తాడేపల్లి : మ్యాజిక్ విషయాల్లో తాను నేర్పించిన దాని కంటే పిల్లల ఆలోచనా శక్తి పెరిగిందని, క్రియేటివిటీగా ఆలోచిస్తున్నారని ప్రఖ్యాత ఇంద్రజాలికులు క్రాంతికార్ హర్షం వ్యక్తం చేశారు. నాలుగు రోజులుగా జరుగుతున్న మ్యాజిక్ శిక్షణా శిబిరంలో హాజరైన చిన్నారుల నుంచి ఆయన గమనించిన విషయాలను వారి దృష్టికి తీసుకొచ్చారు. తాను చేస్తున్న మ్యాజిక్ విషయాల కంటే పిల్లలు అదనంగా విభిన్నంగా కొత్తదనంగా ప్రదర్శించి తనకు ఉత్సాహాన్ని తెస్తున్నారని అన్నారు. సోమవారం శిక్షణలో పేపర్ చార్ట్ ఖాళీగా చూపించి దాన్ని ట్యూబులాగా చుట్టి అందులోంచి పూలదండ తెప్పించారు. బుద్ధ ఆఫ్ మిస్టరీ మ్యాజిక్ శిక్షణలో పది రూపాయల నోటు వంద రూపాయల నోటుగా మార్చి అందరినీ ఆశ్చర్యచితుకులను చేశారు. మొత్తం పది రోజుల శిక్షణలో ఏడు రోజుల పాటు వచ్చే గురువారం వరకు తాను కొన్ని మ్యాజిక్ అంశాలు నేర్పిస్తానని, శుక్రవారం నుంచి ఆదివారం మూడ్రోజులపాటు మ్యాజిక్‌ను విద్యార్థులే స్వయంగా చేసేలా శిక్షణిస్తామని తెలిపారు.





విఆర్‌ఎల సమావేశంలో మాట్లాడుతున్న బందగీసాహెబ్

డ్యూటీ సర్టిఫికెట్ల రద్దు కోసం విఆర్‌ఎల ర్యాలీ

సానుకూలంగా స్పందించిన తహశీల్దార్ - జీతాల జమకు హామీ

ప్రజాశక్తి - రొంపిచర్ల

తమ సర్వీసు రూల్స్‌కు విరుద్ధంగా డ్యూటీ సర్టిఫికెట్లు పెట్టడం అన్యాయమని విఆర్‌ఎలు ఆవేదన వెలిబుచ్చారు. ఈ మేరకు గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం మండల సమావేశం మండల కేంద్రమైన రొంపిచర్లలో సోమవారం నిర్వహించారు. అనంతరం ప్రదర్శనగా తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి వివిధ సమస్యలపై తహశీల్దార్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్, సత్తనపల్లి డివిజన్ అధ్యక్షులు సంజీవరావు, సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరాజు మాట్లాడారు. డ్యూటీ సర్టిఫికెట్ ఇస్తేనే ఆ నెల జీతాలు వేస్తున్నారని, ఈ నిబంధన విఆర్ఎ సర్వీస్ రూల్స్‌కు విరుద్ధమని చెప్పారు. డ్యూటీ సర్టిఫికెట్ల పేరుతో విఆర్‌ఎలను అధికారులు వేధింపులు గురి చేస్తున్నారని వాపోయారు. తహశీల్దార్ స్పందిస్తూ డ్యూటీ సర్టిఫికెట్లతో సంబంధం లేకుండా జీతాలు ప్రతినెల చెల్లిస్తానని చెప్పారు. తమను అధికారులు అగౌరవంగా, కించపరిచేలా మాట్లాడుతున్నారని విఆర్‌ఎలు చెప్పారు. ఈ తీరు కొనసాగితే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం తమ సమస్యలపై 10వ తేదీన ధర్నా చేస్తున్నట్లు నోటీసును తహశీల్దార్‌కు అందించారు.

ఓటేసేటప్పుడు వాటిని చూడొద్దు..

వర్సిటీ విద్యార్థులతో పోసాని కృష్ణమురళి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఇతరులను ఇబ్బంది పెట్టకుండా, మోసం చేయకుండా ఎదగడాన్ని అలవాటు చేసుకోవాలని సినీ రచయిత, నటుడు, ఆంధ్రప్రదేశ్ చలన చిత్ర అభివృద్ధి మండలి అధ్యకులు పోసాని కృష్ణ మురళి అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్, కామర్స్, లా, సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీల సంయుక్తంగా సోమవారం నిర్వహించిన కళాశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమకు నచ్చిన రంగాలను ఎంచుకోవాలని, మరొకరిని తొక్కుకుంటూ కాకుండా స్వశక్తితో ఎదగాలని చెప్పారు. యూనివర్సిటీ పూర్వ విద్యార్థిగా ఆనాటి విద్యార్థి రాజకీయాలను, తరగతి పాఠాలను, కొన్ని సంఘటనలను గుర్తు చేసుకున్నారు. కుల, మత, ప్రాంతీయ అభిమానం ఉండటం సహజమే అయినా వాటి ఆధారంగా అసమర్థులకు, వెన్ను పోటుదారులకు మద్దతివ్వొద్దని వ్యాఖ్యానించారు. తల్లితండ్రులు తమ బిడ్డకు పెళ్లి చేసేటప్పుడు ఎన్ని విధాలుగా ముందు వెనుక ఆలోచిస్తారో అదేరీతిగా ఓటు వేసేటప్పుడు ఆలోచించాలని, కులపిచ్చితో వేయొద్దని సూచించారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ మాట్లాడుతూ చిన్నచిన్న ఉద్యోగాలతో సంతృప్తి చెందకుండా ఉన్నతస్థాయి ఉద్యోగాల్లో స్థిరపడినప్పుడు విశ్వద్యాలయానికి గర్వకారణంగా ఉంటుందన్నారు. ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రు యూనివర్సిటీ, వివిధ రాష్ట్రాల్లోని సెంట్రల్ యూనివర్సిటీలు మీకోసం ఎదరు చూస్తున్నాయని, వాటిలో పరిశోధనల ద్వారా ఉన్నత స్థానాల్లోకి వెళ్లొచ్చని చెప్పారు. రానున్న విద్యా సంవత్సరంలో అనేక కొత్త కోర్సులు ప్రారంభిస్తున్నామని చెప్పారు. పోటీ పరీక్షలకు సమాయత్తం అవుతున్న విద్యార్థుల కోసం రీడింగ్ రూంలో ఏసీ సమకూస్తున్నామని, మహిళా వసతి గృహ ప్రాంగణంలో మరో రీడింగ్ రూంను రాబోయే 6 నెలల్లో నిర్మిస్తామని, బాలికల కోసం మరో కొత్త వసతి భవనాన్ని నిర్మిస్తున్నామని ప్రకటించారు. అనంతరం వర్సిటీలో నిర్వహించిన పలు క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెక్టార్ పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, ప్రిన్సిపాల్ స్వరూపరాణి, కె.గంగాధర్‌రావు పాల్గొన్నారు.





విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ డైరెక్టర్

టెన్త్ పరీక్షల్లో కాటూరి స్కూల్ విజయభేరి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు శివారు లాల్‌పురంలోని కాటూరి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించారని స్కూల్ డైరెక్టర్ కాటూరి వెంకటేశ్వరరావు తెలిపారు. బి.హిమశ్రీ 592, కె.ఎల్.ఎస్. వైష్ణవి 592, పి.నికితకల్యాణి 591 మార్కులు సాధించారని 500కు పైగా మార్కులు 60 మంది విద్యార్థులు సాధించారని, తమ స్కూల్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని వివరించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు డైరెక్టర్ అభినందనలు తెలిపారు.